# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 15-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:173 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

చకచక దేశము పరుగిడ
తకరారుల నెరుగనట్టి తరుణీమణులే
సకలమును నడుపవలెనని
ప్రకటన జేసినది రాష్ట్రపతి ముర్మూజీ !!

(దేశాభివృద్ధికి మహిళల పాత్రే కీలకం అని, మహిళలకు అన్ని రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తే దేశం మరింత ప్రగతి పథంలో నడుస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రకటించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

మూసీ సుందరీకరణ
మురిపెంలో ప్రభుత్వం
ఆపుతుందా విపక్షాల
అడ్డంకుల జవసత్వం
ఇళ్లు పీకి పందిరేసే
ఇగురమైతే నిష్ఫలితం
నిరాశ్రయుల పునరావాసం
నీళ్లొదిలితే దుష్ఫలితం



-వేల్పుల నారాయణ
9440433475

# నా జీవితం ప్రజాస్వామ్యానికి అంకితం..




న్యూఢిల్లీ, మార్చి 14: బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు సాగిన తన జీవిత ప్రయాణం ప్రజాస్వామ్య శక్తిని ప్రతిబింబిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. తన జీవితాన్ని ప్రజాస్వామ్యానికి అంకితం ఇస్తున్నానని చెప్పారు. అయితే ప్రజాస్వామ్య మార్గంలో సాధించే మార్పే శాశ్వతమని ఆమె అన్నారు. ఒకప్పుడు న్యాయస్థానంలో నిందితురాలిగా నిలిచిన తాను, కాలక్రమంలో అదే కోర్టులో న్యాయవాదిగా వాదనలు వినిపించిన సందర్భం తన జీవితంలో కీలక మలుపుగా నిలిచిందని గుర్తు చేశారు.

భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన షీ స్పార్క్స్ 2026 కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శనివారం పాల్గొని ప్రసంగించారు. ఓ జాతీయ మీడియా సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీ ఐఐటీలో జరిగిన కార్యక్రమంలో తన జీవితం, మంత్రిగా తీసుకున్న కీలక నిర్ణయాలపై నిర్వాహకులు అడిగిన పలు ప్రశ్నలకు తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

ఈ సందర్భంగా సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ముందుకు సాగుతున్న మహిళా నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన నిర్వాహకులను ఆమె అభినందించారు. వ్యాపారవేత్తలు, పరిశోధకులు, ఐటీ నిపుణులు, రచయితలు, కళాకారులు, పరిపాలనాధికారులు వంటి అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలు ఈ సమావేశంలో పాల్గొనడం ప్రేరణనిచ్చే విషయమని అన్నారు. ఇలాంటి వేదికలు మహిళల నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆమె తెలిపారు.

తాను రాజకీయ కుటుంబం నుంచి రాలేదని, ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ప్రజాసేవలోకి వచ్చానని మంత్రి గుర్తుచేశారు. ఒకప్పుడు అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన తన జీవితం తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం పెరిగి ప్రధాన ప్రవాహంలోకి వచ్చానని తెలిపారు. విద్య ద్వారా జీవితాన్ని మార్చుకో వచ్చని నమ్మి న్యాయ విద్యను అభ్యసించి న్యాయవాదిగా పనిచేశానని, అనంతరం ప్రజల సేవ కోసం ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు.

తన జీవిత ప్రయాణాన్ని "బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు" అని పేర్కొంటూ, ప్రజాస్వామ్యం ద్వారా సాధించే మార్పు శాశ్వతమని మంత్రి సీతక్క అన్నారు. ఒకప్పుడు న్యాయస్థానంలో నిందితురాలిగా నిలిచిన తాను, తర్వాత అదే కోర్టులో న్యాయవాదిగా నిలిచిన సందర్భం తన జీవితాన్నిమలుపు తిప్పిందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఇది సాధ్యమైందని ఆమె తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం ద్వారా రాష్ట్రంలో 46 లక్షలకుపైగా మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి సామాజిక-ఆర్థిక మార్పుకు దోహదపడుతున్నారని చెప్పారు.

మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, చిన్న మధ్యతరహా వ్యాపారాలకు రుణాలు, మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి విధానం ద్వారా మహిళలకు పెద్ద స్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. స్వయం సహాయక సంఘాలు బస్సులు నిర్వహించడం, కమ్యూనిటీ క్యాంటీన్లు నడపడం, వరి కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం, పాఠశాల యూనిఫార్మ్‌లు తయారు చేయడం వంటి అనేక రంగాల్లో ముందంజలో ఉన్నాయని తెలిపారు.

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన "ఇందిరా మహిళా శక్తి బజార్" ద్వారా గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను నగర మార్కెట్‌కు నేరుగా విక్రయించే అవకాశాన్ని కల్పించామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు బలపడతాయని, సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క అన్నారు. దేశ అభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములు మాత్రమే కాకుండా మార్పుకు నాయకత్వం వహించే స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు అవకాశాలు కల్పిం చేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని మంత్రి పిలుపు నిచ్చారు. ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన ఆదివాసీ అమ్మాయి మంత్రి కాగలిగిందని సంకల్పం, విద్య, ప్రజాస్వామ్యం ఏ జీవితాన్నైనా మార్చగలదనిపేర్కొన్నారు.

## టాంజానియాకు టెక్నాలజీ సహకారం.. ముందుకొచ్చిన తెలంగాణ

హైదరాబాద్, మార్చి 14: టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజిటల్ ఎకానమీగా మారాలన్న టాంజానియా లక్ష్యానికి సాంకేతిక సహకారం అందించడానికి తెలంగాణ ముందుకు వచ్చింది. టాంజానియా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై సహకారం పెంచాలని ఇరు వక్షాలు అంగీకరించాయి.

టాంజానియాలో ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటు చేసే అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. తెలంగాణ 'మీ సేవ' మోడల్ ద్వారా పౌర సేవల డెలివరీ విధానంపై మార్గదర్శకత్వం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'వీ హబ్' (చిఇ ఊబీఎ) ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కల్పించే అంశంపై చర్చించారు. స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్ - స్కిల్లింగ్ రంగాల్లో కూడా సహకారం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'త్వరలో తెలంగాణతో ఎంవోయూ కుదుర్చుకుంటాం. ఈ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది' అని టాంజానియా మంత్రి ప్రకటించారు.

# బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, మార్చి14: గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి(జబిబిజీఎ ఐబీఎజీతీ ఖీవటటఎ) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అయితే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్నట్లు వెల్లడించారు.

ఇవాళ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్(ఒఖఉ) సరఫరాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 811 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.3 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 11 లక్షలు ఉజ్వల పథకం, 28 లక్షలు దీపం పథకం కింద ఉన్నాయని వెల్లడించారు. అదనంగా 7.5 లక్షల కమర్షియల్ కనెక్షన్లు కూడా ఉన్నాయని వెల్లడించారు.

ప్రతి నెల రాష్ట్రంలో 58 లక్షల నుంచి 60 లక్షల వరకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని మంత్రి వివరించారు. ఇటీవల కొన్ని రోజులుగా ప్రజల్లో ఆందోళన కారణంగా బుకింగ్స్ రెట్టింపు అవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ సుమారు 2.5 లక్షల గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా కూడా ఎక్కువగా గ్యాస్ సిలిండర్ల సరఫరా చేసినట్లు మంత్రి చెప్పారు.

అయితే కమర్షియల్ సిలిండర్ల విషయంలో కొంత కొరత ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 23 వేల కమర్షియల్ సిలిండర్లు అవసరం ఉండగా ప్రస్తుతం 6,200 మాత్రమే సరఫరా చేయగలుగుతున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కమర్షియల్ సిలిండర్ల సరఫరా 20 శాతం పరిమితిలోనే జరుగుతోందని చెప్పారు. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ సప్లయ్ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్యాస్ సరఫరా సంబంధిత ఫిర్యాదుల కోసం 180042500333 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

# పెట్రోల్‌ను లూజ్‌గా అమ్మడం నిలిపేయండి..
## పెట్రోల్ పంపులకు కేంద్రం వార్నింగ్

న్యూఢిల్లీ, మార్చి 14: ఇరాన్ పై ఇజ్రాయెల్ , అమెరికా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందుజాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్ ను.. సీసాలు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీచేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది.

ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది.

ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది.

# యుద్ధం ఎఫెక్ట్‌పై భయాందోళనలు సృష్టిస్తున్న కాంగ్రెస్... అస్సాంలో ప్రధానమంత్రి మోదీ



న్యూఢిల్లీ, మార్చి 14: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారం నాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 కోట్లతో సిల్చార్-మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు 'ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైంది. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారింది' అని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**విజన్ లేని కాంగ్రెస్**

కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. మోదీని దూషించడం, అబద్ధాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు.

బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమవుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు.

## 10 క్షిపణులు పరీక్షించిన ఉత్తర కొరియా

సియోల్, మార్చి 14: ఉత్తర కొరియా ఇవాళ తూర్పు జలాల్లోకి 10 బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించినట్లు దక్షిణకొరియా వెల్లడించింది. అమెరికాతో దక్షిణకొరియా సంయుక్త సైనిక విన్యాసాల్లో పాల్గొన్న నేపథ్యంలో ఉత్తర కొరియా తాజాగా క్షిపణి పరీక్షకు పూనుకున్నది. ఉత్తర కొరియా రాజధాని ప్యోంగ్‌యాంగ్ సమీపం నుంచి ఆ క్షిపణులను ఫైర్ చేసినట్లు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ తెలిపారు. అయితే ఆ క్షిపణులు ఎంత దూరం ప్రయాణించాయో తెలియదు. ఎనకామిక్ జోన్ సమీపంలో ఆ క్షిపణులు పడినట్లు జపాన్ రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఉత్తర కొరియా నిర్వహించిన క్షిపణి పరీక్షల సమాచారాన్ని జపాన్, అమెరికాతో ఎప్పటికప్పుడు పంచుకున్నట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. ఉత్తర కొరియా పరీక్షించిన క్షిపణులు సుమారు 340 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు జపాన్ రక్షణ శాఖ వెల్లడించింది.

## పిల్లల గొంతు నులిమి ఉరేసుకున్న తల్లి..!

హైదరాబాద్, మార్చి 14: ఓ మహిళ తన ఇద్దరు పిల్లల గొంతు నులిమి తాను ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర సంఘటన హైదరాబాద్ బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెద్దమ్మనగర్‌కు చెందిన సత్యవాణి, మురళి వేణు దంపతులకు కుమారుడు(5), కుమార్తె(2) ఉన్నారు. అయితే మురళి వేణు తన తండ్రిని డయాలసిస్ చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లగా.. ఆ సమయంలో సత్యవాణి తన ఇద్దరు పిల్లల గొంతు నులిమి తాను ఉరేసుకుంది. అతిబిఎ డ ఒనీఞజీశ్రీ ఉబీతిటవబ

ఈ ఘటనలో సత్యవతి, ఆమె కుమారుడు మృతి చెందగా.. కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాలతో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కవ్వాల్ టైగర్ జోన్‌లో విషాదం.. చిరుత పులి మృతి.. ముగ్గురు వేటగాళ్ల అరెస్ట్


మంచిర్యాల, మార్చి14: వన్యప్రాణుల సంరక్షణకు నిలయమైన కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. జిల్లాలోని తాళ్లపేట రేంజ్ అటవీ ప్రాంతంలో ఒక చిరుత పులి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన అటవీ శాఖ వర్గాల్లో కలకలం రేపింది. గత కొన్ని రోజులుగా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత కనిపించకపోవడంతో అప్రమత్తమైన అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తాళ్లపేట రేంజ్ పరిధిలో చిరుత కళేబరాన్ని గుర్తించారు.

ఈ ఘటనపై అటవీశాఖ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇది వేటగాళ్ల పనిగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

దర్యాప్తులో భాగంగా అనుమానితుల కదలికలపై అటవీ శాఖ ప్రత్యేక బృందాలు నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి చిరుత గోర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల అవయవాల స్మగ్లింగ్ ముఠాతో వీరికి ఏవైనా లింకులు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం షెడ్యూల్-1 జాబితాలో ఉన్న చిరుతను వేటాడం తీవ్రమైన నేరం. పట్టుబడిన నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## విద్యాశాఖ నిర్లక్ష్యం.. 80 మంది విద్యార్థులకు అదే స్కూల్‌లో ఎగ్జామ్ సెంటర్

హైదరాబాద్, మార్చి 14: పదో తరగతి పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి న్యూ ఎరా స్కూల్‌లో చదువుతున్న 80 మంది విద్యార్థులకు అదే స్కూల్‌ను పరీక్షా కేంద్రంగా కేటాయించడం వివాదంగా మారింది. సాధారణంగా విద్యార్థులు తమ స్కూల్ నుంచి వివిధ కేంద్రాల్లో పరీక్షలు రాయాల్సి ఉంటుంది. కానీ న్యూ ఎరా స్కూల్ విద్యార్థులకు మాత్రం అదే స్కూల్‌లో కేంద్రం ఏర్పాటు చేయడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది.

# సురక్షితమైన ఉత్పత్తులతో వినియోగదారుల నమ్మకం !

## (15 మార్చి "ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం" సందర్భంగా)

వ్యాపార వాణిజ్యాలకు కేంద్ర బిందువు ఏకైక వినియోగదారుడు మాత్రమే. వినియోగదారులకు స్పష్టమైన హక్కులు, బాధ్యతలు ఉంటాయి. అనైతిక అన్యాయమైనా వస్తు సేవలు, అక్రమ వ్యాపార పద్ధతులతో వినియోగదారుడు నష్టపోవడంతో అనాదిగా కొనసాగుతున్నది. వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, సమస్యల పట్ల తొలిసారి 15 మార్చి 1962న అమెరికాలో నాటి అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడికి కొన్ని స్పష్టమైన హక్కులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఉపన్యాసాన్ని ప్రేరణగా తీసుకొని ప్రపంచ మానవాళి ప్రతి ఏట 15 మార్చిన "ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం (వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే)"ను పాచించుట 1983 నుంచి ఆనవాయితీగా మారింది. వినియోగదారుల హక్కుల ప్రాధాన్యం, నిజాయితీగా వ్యాపార పద్దతులు పాటించడం, వినియోగదారుల చట్టాల పరిజ్ఞానం, వస్తు నాణ్యత - సేవలు, వ్యాపార ఆచరణలు, సుస్థిర జీవనశైలి దిశగా వినియోగదారులు మారడం, వినియోగదారుల రక్షణ చర్యలు లాంటి అంశాలను ప్రచారం చేయడానికి ఈ వేదికలను వినియోగించుకోవడం గత నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నది.

సుస్థిర జీవనశైలి దిశగా వినియోగదారుల మారడం:

2025 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం - 2026 ఇతివృత్తంగా "సురక్షిత ఉత్పత్తులు, నమ్మకంతో కూడిన వినియోగదారులు" అనే అంశాన్ని తీసుకొని ఆరోగ్యకర జీవనశైలి వైపు వినియోగదారుల దృష్టి కోణం మారడం, అందరికీ అందుబాటులోకి తేవడం లాంటివి జరగాలి. భారత వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాల ద్వారా భద్రత హక్కు, సమాచార హక్కు, ఎంపిక హక్కు, అభిప్రాయాలను వినిపించే హక్కు, పరిష్కార హక్కు, వినియోగదారుల విద్య హక్కు లాంటివి కల్పించబడినవి. కల్తీలు, చీకటి వ్యాపారాలు వినియోగదారులకు శాపాలుగా మారుతున్నాయి. భారత్‌లో 24 డిసెంబర్‌న "జాతీయ వినియోగదారుల దినం" జరుపుకోవడం జరుగుతోంది. వినియోగదారులకు అన్యాయాలకు, వస్తు సేవల లోపాలకు గురైనపుడు కోర్టులను లేదా ఫోరమ్‌లను ఆశ్రయించి న్యాయం పొందడమే కాకుండా అక్రమ వ్యాపారులకు శిక్షలు పడడానికి కూడా వెసులుబాటు కల్పించారు. వస్తు విలువలను బట్టి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి వినియోగదారుల కోర్టుల్లో పరిష్కారాలు అందుతున్నాయి.

వినియోగదారులు హక్కులను అనుభవిస్తూనే తమ బాధ్యతలను కూడా మరువకుండా చట్టాలను గౌరవిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలి. వినియోగదారుల విద్య పట్ల అవగాహన పెంచుకొని నైతిక విలువలతో ప్రవర్తిస్తూ వ్యాపారుల అనైతిక చర్యలకు స్పందిస్తూ ముందుకు సాగాలి.

వ్యాపార సంస్థలు, వినియోగదారుల మధ్య సద్భావనలు, నమ్మకాలు, నీతి నిజాయితీలు, జవాబుదారీతనం లాంటి అంశాల్లో సరైన సంబంధాలు కలిగి ఉండాలి.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వ్యవసాయ-ఆహార రంగంలో మహిళల పాత్రపై ప్రపంచ సదస్సు ప్రారంభం... హాజరైన భారత రాష్ట్రపతి




న్యూఢిల్లీ, మార్చి 14: వ్యవసాయ, ఆహార రంగంలో మహిళల పాత్రపై నేడు (12 మార్చి 2026) న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచ సదస్సు ప్రారంభ సమావేశంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. వ్యవసాయ సంబంధిత పనులన్నింటిలోనూ మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. విత్తనాలు నాటడం, పంట కోయడం, ప్రాసెసింగ్ చేయడం, పంటను మార్కెట్ కు తరలించడం వరకు ప్రతి దశలోనూ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, పశుసంపద, అటవీ ఉత్పత్తుల సద్వినియోగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల నిర్వహణ వంటి అనేక రంగాల్లో మహిళలు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు మహిళలు అమూల్యమైన సహకారం అందిస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో మొత్తం విద్యార్థుల్లో 50 శాతం కంటే ఎక్కువ మంది అమ్మాయిలే ఉన్నారని, ఇతర అనేక విశ్వవిద్యాలయాల్లోనూ అమ్మాయిల సంఖ్య 60 శాతానికి పైనే ఉందని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. విద్యలోనూ అమ్మాయిలు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నారని కొనియాడారు. వ్యవసాయం, ఆహార ధాన్యాల రంగాలలో నాయకత్వం వహించడానికి ఈ ఆశాజనక బాలికలకు సాధ్యమైనంత మద్దతు, ప్రోత్సాహాన్ని అందించడం ప్రభుత్వం, సమాజం, వ్యవసాయ రంగంలోని వాటాదారులందరి బాధ్యత అని రాష్ట్రపతి పేర్కొన్నారు. నాయకత్వం మాతృత్వంలోనే సహజసిద్ధంగా ఉంటుందన్నారు. అయితే.. మాతృత్వం తరచుగా నాలుగు గోడలకే పరిమితమవుతుందని భావిస్తుంటారని, మనం ఈ మనస్తత్వాన్ని అధిగమించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళా రైతులు నాయకత్వ బాధ్యత వహించే దిశగా వారిని సాధికారులను చేసే దృక్పథంతో ముందుకు సాగాలని ఆమె చెప్పారు.

2026 ఏడాదిని "అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరం"గా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము తెలిపారు. వ్యవసాయ, ఆహార రంగంలో స్త్రీపురుష వివక్షను తొలగించడానికి మహిళలకు నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా ప్రోత్సహించడానికి సమష్టి చర్య అవసరమని ఈ ప్రకటన పిలుపునిచ్చిందని ఆమె అన్నారు.

వ్యవసాయం, ముఖ్యంగా వ్యవసాయ, ఆహార రంగంలో నిమగ్నమై ఉన్న మహిళల్లో నాయకత్వాన్ని ప్రోత్సహించడం చాలా ముఖ్యమని రాష్ట్రపతి పేర్కొన్నారు. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి దార్శనికతతో భారత్ ముందుకు సాగుతోందని చెప్పారు. వ్యవసాయ రంగంలోని మహిళలు విధాన రూపకల్పన, నిర్ణయాధికారం, నాయకత్వ పదవుల్లో కీలక పాత్రను పోషించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల లింగ-సమ్మిళిత వ్యవసాయ వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

అధికారిక భూ హక్కులు, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వనరులు, ఇతర సహాయక వ్యవస్థలకు సంబంధించిన అంశాల్లో మహిళా రైతులకు అండగా నిలవాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో వ్యవసాయ రంగంలో మహిళా సాధికారత కోసం భారత్ అనేక చర్యలు తీసుకోవడంపై శ్రీమతి ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయంలో మహిళా సాధికారతను పెంపొందించడంలో మహిళల నేతృత్వంలోని స్వయం సహాయక బృందాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలును ప్రోత్సహించే కార్యక్రమాలు సమర్థవంతమైన ఫలితాలను ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలు, భూమి, శ్రేయస్సు, శాంత, భాగస్వామ్యాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడంపై ప్రపంచ వ్యాప్తంగా ఏకాభిప్రాయం ఉందని రాష్ట్రపతి అన్నారు. 'ప్రజలు' అనే అంశంపై ఆలోచనల్లోనూ, ఆచరణలోనూ స్త్రీపురుష సమానత్వానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె భాగస్వాములందరినీ కోరారు. వ్యవసాయంతో సహా ప్రతి రంగంలోనూ సమర్థ వంతమైన లింగ-సమ్మిళిత విధానం ఉంటే మనం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడమే కాకుండా.. ఈ 'భూమి'ని మరింత సున్నితమైన,సామరస్యపూర్వకమైన ప్రదేశంగా మార్చగలమని అన్నారు. ఈ ప్రపంచ సదస్సులో పాల్గొనేవారు ప్రగతికి బాటలు వేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# అంతరిక్ష కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచుతున్న ఇస్రో

న్యూఢిల్లీ, మార్చి 14:కేంద్ర శాస్త్ర-సాంకేతిక మంత్రిత్వ శాఖ, భూవిజ్ఞాన శాఖ (స్వతంత్ర), ప్రధాని కార్యాలయ, సిబ్బ ంది-ప్రజా ఫిర్యాదులు-పెన్షన్లు, అణు శక్తి-అంతరిక్ష శాఖల (స్వతంత్ర) సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ నేడు రాజ్యసభలో కీలక సమాచారం అందించారు. ఉపగ్రహాల అభివృద్ధి, పేలోడ్ ప్రయోగాలు, అంతరిక్ష మిషన్లలో విద్యార్థులు, యువ పరిశోధకులను చురుగ్గా భాగస్వాములను చేయడానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) వరుసగా నిర్మాణాత్మక కార్యక్రమాలను ప్రారంభించిందని ఆయన వెల్లడించారు. రాజ్యసభలో శ్రీమతి సుమిత్ర బాల్మీక్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన డాక్టర్ జితేంద్ర సింగ్.. అంతరిక్ష సాంకేతికతను సామాన్యులకు అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని విద్యాసంస్థలతో సహా దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ వేగంగా విస్తరిస్తున్న భారత అంతరిక్ష వ్యవస్థలో భాగస్వామ్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఉపగ్రహ డిజైన్, పేలోడ్ అభివృద్ధి, రాకెట్ ప్రయోగాలు వంటి వాస్తవ అంతరిక్ష సాంకేతిక ప్రాజెక్టులపై విద్యార్థి పరిశోధకులు పనిచేయడానికి ఇస్రో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసిందని కేంద్ర మంత్రి తెలిపారు. యూ.ఆర్.రావు ఉపగ్రహ కేంద్రం నేతృత్వంలోని 'విద్యార్థి ఉపగ్రహం కార్యక్రమం' కింద విద్యాసంస్థలు, విద్యార్థి బృందాలు ఇస్రో శాస్త్రవేత్తల సాంకేతిక మార్గదర్శకత్వంతో ఉపగ్రహాలను రూపొందించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ విధంగా విద్యార్థులు నిర్మించిన ఉపగ్రహాలకు ఇస్రో ప్రయోగాల ద్వారా అనుసంధాన మద్దతు, ప్రయోగ అవకాశాలు కూడా లభిస్తున్నాయి.

గుర్తింపు పొందిన విద్యాసంస్థల నుంచి డిగ్రీ, పీజీ, డాక్టోరల్ విద్యార్థుల కోసం ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్ ట్రైనీ పథకాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు ఇస్రో కేంద్రాల్లో విద్యార్థులకు ప్రయోగాత్మక పరిశోధనా అనుభవాన్ని అందిస్తాయని.. తద్వారా యువ పరిశోధకులకు అత్యాధునిక అంతరిక్ష సాంకేతికతలతో నేరుగా పని చేసే అవకాశం లభిస్తుందని ఆయన వివరించారు. విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలలో 'అంతరిక్ష సాంకేతిక ఇంక్యుబేషన్ కేంద్రాలు' (ఎస్‌టీఐసీ) ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాలు విశ్వవిద్యాలయాలు, ఇస్రో శాస్త్రవేత్తల మధ్య ఉమ్మడి పరిశోధనలను సులభతరం చేస్తాయి. నిపుణుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు స్వదేశీ అంతరిక్ష సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి సహాయపడతాయి. అంతరిక్ష రంగంలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో ఇన్-స్పేస్ (ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్) పాత్రను కూడా కేంద్ర మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. కాన్పరిమాణంలోని ఉపగ్రహాలు, మోడల్ రాకెట్ల రూపకల్పన, అభివృద్ధిపై విద్యార్థుల కోసం పోటీలను ఇన్-స్పేస్ నిర్వహించింది. ఈ పోటీలలో దాదాపు 850 మంది విద్యార్థులతో కూడిన 97 విద్యార్థి బృందాలు పాల్గొన్నాయని ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు 17 విద్యార్థి ఉపగ్రహాలు, పేలోడ్‌లకు ఇన్-స్పేస్ అనుమతులు ఇచ్చిందన్న డాక్టర్ జితేంద్ర సింగ్.. వాటిలో ఇప్పటికే 11 విజయవంతంగా ప్రయోగించినట్లు సభకు తెలిపారు. ఈ మిషన్లలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్, ఐఐఎస్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ), ఆర్‌వీ ఇంజనీరింగ్ కళాశాల, మహారాష్ట్రలోని అమిటీ విశ్వవిద్యాలయం, ఎంఐటీ వరల్డ్ పీస్ విశ్వవిద్యాలయం, అస్సాం డాన్ బాస్కో విశ్వవిద్యాలయం, సీవీ రామన్ గ్లోబల్ విశ్వవిద్యాలయం వంటి దేశవ్యాప్త విద్యాసంస్థలు పాల్గొన్నాయి. విద్యార్థుల నేతృత్వంలోని అంతరిక్ష మిషన్లలో పెరుగుతున్న జాతీయ భాగస్వామ్యాన్ని ఇది తెలియజేస్తోందని ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనలను మరింత సమ్మిళితం చేయాలనే ప్రభుత్వ నిబద్ధత ప్రస్తావించిన ఆయన.. ఇస్రో చేపట్టిన రెస్పాండ్ (రెస్పాండ్ - స్పాన్సర్డ్ రీసెర్చ్) కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలకు అంతరిక్ష శాస్త్రం, సాంకేతికత, అప్లికేషన్లలో పరిశోధనలు చేయడానికి ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

# పేదల కష్టాన్ని చూసి చలించే నేత పవన్ కళ్యాణ్

### -అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
### -అవనిగడ్డ కోర్టు సెంటర్లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
### -పార్టీ జెండా ఎగురవేసి చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే
### -కేక్ కట్ చేసి పంచిపెట్టిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్




అమరావతి, మార్చి 14: పేదల కష్టాన్ని చూసి చలించే నేత పవన్ కళ్యాణ్ అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం అవనిగడ్డ కోర్టు సెంటర్లో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టౌన్ అధ్యక్షులు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతి ఏటా రాయపూడి వేణుగోపాల్ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి పానకం పంచిపెట్టారు.

పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం గురించి పరితపించే నేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రధాని మోదీ చెప్పినట్లు పవన్ కళ్యాణ్ అనే తుఫానులో వైసీపీ కొట్టుకుపోయిందన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసిన రోజు వైసీపీ సృష్టించిన అనేక అవరోధాలు ఎదుర్కొని చంద్రబాబుకు బాసటగా నిలిచి బిజెపిని కలుపుకొని కూటమి ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ధీరోదాత్త నేత పవన్ కళ్యాణ్ అని తెలిపారు.

జనసేనకు బలమైన ఓట్ బ్యాంక్ ఉందన్నారు. ఎవరినైనా గెలిపించగల శక్తి, ఓడించగల శక్తి జనసేనకు ఉందని గుర్తించి వ్యవహరించాలని స్పష్టం చేశారు. కూటమిలో అనైక్యత తెచ్చేందుకు కొంతమంది చేసే రెచ్చగొట్టే ప్రయత్నాలపై ప్రతిస్పందించవద్దని సూచించారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా శ్రేణులు సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశానికి అనుగుణంగా 15 ఏళ్లు కలిసి ఉండాలనే ఆకాంక్ష నిలబెట్టుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. మహాత్మా గాంధీ ఆకాంక్షించిన గ్రామ స్వరాజ్యాన్ని ఆచరించి చూపిన నాయకుడు పవన్ కళ్యాణ్ అని తెలిపారు. వైసిపి పరిపాలనలో అధ్వాన స్థితికి చేరుకున్న రహదారులను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో విస్తృత సంఖ్యలో జరుగుతున్న తారు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణం గురించి జన సైనికులు గర్వంగా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం లోని అన్ని రోడ్లు అభివృద్ధి చేసే సంకల్పంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, చెన్నగిరి సత్య నారాయణ, బాదర్ల లోలాక్షుడు, గుడివాక శివరావు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, జిల్లా కర్రసాము అసోసియేషన్ చైర్మన్ సింహాద్రి పవన్, పార్టీ మండల ఉపాధ్యక్షులు తుంగల నరేష్, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, దేవస్థానం డైరెక్టర్లు కోసూరు అవినాష్, మత్తి శివపార్వతి, నాయకులు కమతం నరేష్, యాసం శ్రీరాములు, కమ్మిలి సాయి భార్గవ, ఆళ్లమల్ల చందుబాబు, మాదివాడ రాము, భోగాది శ్రీలక్ష్మి, గుగ్గిలం అనీల్-గాయత్రి, అన్నపరెడ్డి రామదాస్, అన్నపరెడ్డి ఏసు, గౌస్ పాల్గొన్నారు.

# చల్లపల్లిలో ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం..



అమరావతి, మార్చి 14:జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం చల్లపల్లి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయం వద్ద అవనిగడ్డ నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన సెంటర్లో మండలి వెంకట్రామ్, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు చోడగం విమల్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి తోట మురళి కృష్ణ, అనుమకొండ పూర్ణ చంద్రశేఖరరావు (ప్రెస్ పూర్ణ), పసుపులేటి రవికుమార్, బుల్లా కిషోర్, సుధాని నందగోపాల్, మిరియాల జితేంద్ర, మడమల రంజిత్, గంగిశెట్టి రాజేంద్ర, ఉరిమి మణికాంత్, రాయవరపు నాంచారయ్య, గోవాడ రాము, కంతేటి చంద్రశేఖర్, మత్తి మురళి, నల్లమోతు వీరయ్య తదితర జనసేన పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు

# అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 100 రోజులే మిగిలిన నేపథ్యంలో 'యోగా మహోత్సవ్' నిర్వహణ

న్యూఢిల్లీ, మార్చి 14:కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖలో ఓ భాగమైన మురార్జీ దేశాయి జాతీయ యోగా సంస్థ (ఎండీఎన్ఐవై) 2026 మార్చి నెల 13న విజ్ఞ?న్ భవన్లో యోగా మహోత్సవ్-2026ను ఏర్పాటు చేస్తోంది. ఈ కార్యక్రమం 'అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026'కు మరో 100 రోజులు మాత్రమే మిగిలి ఉండటాన్ని సూచిస్తోంది. ఆయుష్ శాఖ తన వివిధ ఆసక్తిదారులతో కలిసి, అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఇంకో 100 రోజులే మిగిలాయని ఒక్కొక్క రోజును గణించే విధంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిలో 100 సంస్థలు వంద ప్రదేశాలు/నగరాల్లో యోగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ నెల 13న విజ్ఞన్ భవన్లో ఉదయం 9 గంటల నుంచి ఒక మహా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో కేబినెట్ మంత్రులు పాల్గొనే అవకాశం ఉంది. కార్యక్రమంలో కేంద్ర ఆయుష్ శాఖకు చెందిన సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత)తో పాటు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కొటేచా, బెంగళూరులోని ఎస్-వ్యాస సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ హెచ్.ఆర్. నాగేంద్ర, కేంద్ర ఆయుష్ శాఖ సంయుక్త కార్యదర్శి మోనాలిసా డాష్, ఇతర ప్రముఖులు, యోగా గురువులు, యోగా పండితులు, ఆయుష్ నిపుణులు, ఆధునిక వైద్యంతో పాటు సంబంధిత విజ్ఞ?నశాస్త్ర నిపుణులు, ప్రతినిధులు, యోగ ప్రేమికులు, యోగ సాధకులు కూడా పాలుపంచుకుంటారు.

ఈ సందర్భంగా ఆయుష్ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ మాట్లాడుతూ, " ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సూచన మేరకు ఐక్యరాజ్యసమితి 2014వ సంవత్సరంలో జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించాలనే చరిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్న సంగతి మీకందరికీ తెలుసు.

యోగాకు ప్రపంచవ్యాప్త ఆమోదం లభించడం మన దేశానికి గర్వకారణం. యోగా మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వంలో విడదీయలేని భాగం. అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడీవై)ని నిర్వహించే బాధ్యత నోడల్ మంత్రిత్వ శాఖగా 'ఆయుష్'పై ఉంది. ప్రతి ఏటా, ఐడీవై ముఖ్య కార్యక్రమంలో భాగంగా ఒక సామూహిక యోగా ప్రదర్శన ఉంటుంది. దీనికి ప్రధాని స్వయంగా నాయకత్వం వహిస్తారు. ఐడీవై సన్నాహాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి" అన్నారు.

ఐడీవై చోటుచేసుకోవడానికి మిగిలి ఉన్న 100 రోజులను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం ఉత్సవానికి సన్నాహాలు చేయడానికి ముఖ్య దశను నిర్వహిస్తుంటారు.

ఈ కాలంలో, మంత్రిత్వ శాఖ తన ప్రచారాన్నీ, ప్రసారాన్నీ విస్తృత స్థాయిలో చేపట్టడానికీ, యోగా సందేశాన్ని మరింత మంది చెంతకు చేరవేయడానికీ ప్రయత్నిస్తుంటుంది. దేశం నలుమూలలా ప్రజలను కలుపుకొని ముందుకు పోవడంతో పాటు ఐడీవై 2026కు ముందటి 100 రోజుల్లో ప్రజలు ఎక్కువ సంఖ్యలో భాగస్వామ్యం పంచుకొనేటట్లు వారిని ప్రోత్సహించడం ఈ ప్రయత్నాల లక్ష్యం.

రాబోయే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా, ఆయుష్ శాఖ 100 కీలక స్థానాల్లో ఈ సందర్భాన్ని నిర్వహించాలని ప్రతిపాదించింది. 100 రోజులకు ముందే సన్నాహాలు మొదలుపెట్టారు. ఐడీవై-2026 సన్నాహాలు వేగం పుంజుకొంటున్నాయి.. ఈ సన్నాహక చర్యలు యోగాను ఓ సంపూర్ణ శ్రేయో సాధన మార్గంగా స్వీకరించి ఈ పండుగలో పాల్గొనేందుకు దేశమంతటా ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయి.

# విక్రమ్ సారాభాయ్ పుస్తకం ఆవిష్కరణ

## -భారత అంతరిక్ష విజ్ఞానానికి సారాభాయ్ సేవలు చిరస్మరణీయం



అమరావతి, మార్చి 14:విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజీ లో ఫాదర్ గోర్డన్ లైబ్రరీ ఆధ్వర్యంలో నిర్వహించిన లోయోలా రివ్యూయర్స్ అసోసియేషన్ కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త విక్రమ్ సరేబాయ్ జీవితాన్ని ఆవిష్కరించే పుస్తకంపై సమీక్ష నిర్వహించారు. అందరూ ఆకాశంలో నక్షత్రాలను చూస్తే, సారాభాయ్ భారతదేశ భవిష్యత్తును చూశారు అంటూ నిర్వహించినఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత మరిట అమృత షా రచించిన "విక్రమ్ సారాభాయ్" పుస్తకాన్ని చర్చించారు.

భారత అంతరిక్ష కార్యక్రమానికి పునాది వేసిన సారాభాయ్ దూరదృష్టి, శాస్త్రీయ దృక్పథం, దేశాభివృద్ధికి చేసిన సేవలను పుస్తకం విపులంగా ప్రతిబింబిస్తుందని వక్తలు పేర్కొన్నారు. కె. సురేష్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష రంగంలో ప్రపంచ దేశాలకు పోటీగా ఎదగడానికి విక్రమ్ సారాభాయ్ చేసిన కృషి అపారమని అన్నారు. చంద్రయాన్, మంగళయాన్ వంటి విజయాలకు ఆయన ఆలోచనలు పునాది అయ్యాయని వివరించారు. 0భారత విజ్ఞాన రంగంలో ఆయన చూపిన దిశ దేశ అభివృద్ధికి మార్గదర్శకమైందని చెప్పారు. విద్యార్థుల్లో విజ్ఞానాసక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంపొందిం చేందుకు ఇటువంటి పుస్తక సమీక్షలు ఉపయో గపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీ. శ్రీకుమార్, డాక్టర్ ఎన్.ఏ. ఫిలిప్స్ మెల్విన్, తిమిరాల దీన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి లోయోలా రివ్యూయర్స్ అసోసి యేషన్ కార్యదర్శి డాక్టర్ జి.ఏ. ప్రసాద్ రావు అధ్యక్షత వహించారు.

# ఏ-ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో పవిత్ర రంజాన్ ఇఫ్తార్ విందు..

## -కార్యక్రమ నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు

అమరావతి, మార్చి 14:ఈ నెల 16వ తేదీన పవిత్ర రంజాన్ మాసాన్ని పుర స్కరించుకొని నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఇఫ్తార్ విందు ల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, అతిథుల కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు



కార్యక్రమం గతంలో నిర్ణయించిన విధంగా విజయవాడలోని ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో కాకుండా ఏ-ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. రాష్ట్రస్థాయి ప్రభుత్వ సూచనల మేరకు ఇఫ్తార్ విందు కార్యక్రమానికి సంబంధించిన వేదిక మార్పు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఇఫ్తార్ విందు లో పాల్గొనే మత పెద్దలు ముస్లిం సోదరులు ప్రజాప్రతినిధులు వేదిక మార్పును గమనించి ఏ ప్లస్ కన్వెన్షన్ కు హాజరు కావాలని ఆయన కోరారు.

ఇందుకు సభందించి చేయా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఇఫ్తార్ విందుకు రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, వివిధ వర్గాల ప్రతినిధులు, ప్రముఖులు హాజరు కానున్నారని ఈ నేపథ్యంలో కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

కార్యక్రమ వేదిక వద్ద పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, శుద్ధమైన తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అతిథులు సౌకర్యవంతంగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తిచేయాలని తెలిపారు. ముస్లిం సోదరులకు పవిత్రమైన రంజాన్ మాసం నేపథ్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా, సోదరభావాన్ని పెంపొందించేలా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల కోసం ఏఐ ఆధారిత 'భారత్ విస్తార్' వేదిక ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 14:వ్యవసాయ రంగం, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న విశేష చర్యల్లో భాగంగా, రేపు, మార్చి 13న, అస్సాంలోని గువహటిలో జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) 22వ విడత కింద రూ. 18,640 కోట్లను దేశంలోని 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేస్తారని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఇప్పటివరకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిబిటి) ద్వారా రూ. 4,09,000 కోట్లకు పైగా పంపిణీ చేసినట్లు, ఇందులో 2.15 కోట్లకు పైగా మహిళా రైతులు ఉన్నారని వెల్లడించారు. ఈ ప్రత్యక్ష ఆర్థిక సాయం వల్ల వ్యవసాయ పెట్టుబడులు పెరిగాయని, వడ్డీ వ్యాపారులపై రైతుల ఆధారపడటం తగ్గిందని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని అధ్యయనాలు చెబుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమ మహా యజ్ఞం నిరంతరాయంగా కొనసాగుతుందని శ్రీ శివరాజ్ సింగ్ పేర్కొన్నారు.

గత 12 ఏళ్లలో వ్యవసాయ రంగంలో భారత ప్రభుత్వం సాధించిన పురోగతిని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ వివరించారు. ధాన్యాల కొరత ఎదుర్కొన్న స్థాయి నుంచి భారత్ ఇప్పుడు ప్రపంచ శక్తిగా ఎదిగిందని, ప్రభుత్వ విధానాలు, రైతుల కృషి వల్ల ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. బియ్యం ఉత్పత్తిలో భారత్ 150 మిలియన్ టన్నులతో చైనాను అధిగమించి ప్రపంచంలోనే మొదటి స్థానానికి చేరుకుందని ఆయన తెలిపారు.

2014లో 252 మిలియన్ టన్నులుగా ఉన్న దేశ మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇప్పుడు 357 మిలియన్ టన్నులకు పెరిగిందని కేంద్ర వ్యవసాయ మంత్రి తెలిపారు.

ఉద్యానవన రంగంలో కూడా గణనీయమైన వృద్ధి నమోదైంది. పండ్లు, కూరగాయల ఉత్పత్తి 277 మిలియన్ టన్నుల నుంచి 369 మిలియన్ టన్నులకు పెరిగింది. పప్పుధాన్యాల ఉత్పత్తిలో భారత్ నేడు స్వయం సమృద్ధి దిశగా సాగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో భారత్ అగ్రస్థానంలో ఉంది. కందులు, పెసలు, మినుము వంటి పప్పుధాన్యాలను ప్రభుత్వం రికార్డు స్థాయిలో కొనుగోలు చేస్తోంది.

రైతులకు సహాయం చేసేందుకు ప్రభుత్వం 'భారత్ విస్తార్' పేరుతో ఏఐ డిజిటల్ వేదిక మొదటి దశను ప్రారంభించినట్లు శ్రీ శివరాజ్ సింగ్ తెలిపారు. దీని ద్వారా కేవలం ఒక ఫోన్ కాల్‌తో రైతులు తమ స్థానిక భాషలో వ్యవసాయానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. గత సంవత్సరాల్లో గోధుమలు, వరి, పత్తి, నూనెగింజలు, పప్పుధాన్యాలను కనీస మద్దతు ధరకు రికార్డు స్థాయిలో కొనుగోలు చేశామని, రైతులకు తక్కువ ధరకే ఎరువులు అందేలా చూశామని ఆయన వివరించారు.

2014లో రూ. 8,45,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ రుణాలు ఇప్పుడు రూ. 28,69,000 కోట్లకు పెరిగినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి తెలిపారు.

# మనకు ఉన్నది ఒకే లక్ష్యం ఒకే గమ్యం.. అది 'వికసిత భారత్' : ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 14:చారిత్రాత్మక దండి యాత్ర వార్షికోత్సవం సందర్భంగా ఐటీవీ నెట్‌వర్క్ నిర్వహించిన ఎన్ఎక్స్‌టీ సదస్సులో ప్రధానమంత్రి ప్రసంగించారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి, అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రస్తుత లక్ష్యానికి మధ్య ఉన్న పోలికలను ఆయన వివరించారు. 1930 నాటి దండి యాత్ర దేశాన్ని స్వాతంత్ర్యం వైపు ఎలాగైతే ఏకం చేసిందో ప్రస్తుత 'వికసిత భారత్' మిషన్ కూడా 140 కోట్ల భారతీయుల ఉమ్మడి లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. "చారిత్రాత్మక దండి యాత్ర ప్రారంభమై దాదాపు 100 సంవత్సరాలు గడిచిన తరుణంలో నేడు భారతీయులమైన మనం మరోసారి 'వికసిత భారత్' సాధన కోసం ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాం" అని ప్రధాని పేర్కొన్నారు.

21వ శతాబ్దపు విలక్షణమైన సవాళ్లను ప్రస్తావించిన ప్రధాన మంత్రి.. ప్రపంచ సంఘర్షణలు, సరఫరా గొలుసుల అంతరాయాల మధ్య కూడా భారత్ ఒక ఆశాకిరణంగా, స్థిరత్వానికి చిహ్నంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి అగ్ర నాయకత్వం, నిపుణులు ఇప్పుడు భారత్‌ను నూతన ప్రపంచ క్రమానికి ప్రధాన చోదక శక్తిగా చూస్తున్నారని ఆయన ప్రముఖంగా చెప్పారు. ఇటీవల తన పర్యటనలో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ మాట్లాడుతూ ప్రపంచ గమనాన్ని ఇకపై 'గ్లోబల్ సౌత్' నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించినట్లు ప్రధాని గుర్తు చేశారు. కెనడాకు చెందిన మార్క్ కార్నీ అభిప్రాయం ప్రకారం రాబోయే మూడు దశాబ్దాలలో ప్రపంచ ఆర్థిక కేంద్రం భారత్ వైపు మళ్లనుందని ప్రధాని తెలిపారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ ఒక అనివార్యమైన భాగస్వామి అన్న అభిప్రాయంతో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఉన్నారని ఆయన పేర్కొన్నారు. "మీరు భవిష్యత్తులో భాగం కావాలనుకుంటే భారత్‌తో అనుబంధం కలిగి ఉండాలి. మీరు భారత్‌లోనే ఉండాలి" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారతీయ పౌరులలో మునుపెన్నడూ లేనంత విశ్వాసం, ఆకాంక్షలు ఉన్నాయన్న ఆయన.. ఆర్థిక వృద్ధిపై ప్రజలకు ఉన్న ఆసక్తిని క్రికెట్ పట్ల దేశానికి ఉన్న మక్కువతో పోల్చారు. ఒకప్పుడు అసాధ్యమని భావించిన డిజిటల్ చెల్లింపులు, భారీ స్థాయి సంస్కరణల ద్వారా దేశం 'తదుపరి స్థాయి' కార్యకలాపాలకు మారిన తీరును ఆయన వివరించారు. "భారత్ కేవలం పురోగతి సాధించడం మాత్రమే కాదు తదుపరి దశకు దూసుకుపోతోంది" అని ఆయన ఉద్ఘాటించారు.

దేశానికి క్రికెట్ పట్ల ఉన్న మక్కువతో భారత వృద్ధిపై ప్రజలకు ఉన్న ప్రస్తుత ఆసక్తిని పోలుస్తూ ప్రధానమంత్రి ఒక స్పష్టమైన ఉదాహరణను ఇచ్చారు. ప్రజలు టీ-20 ప్రపంచ కప్ స్కోర్‌ను ఎంత ఆత్రుతగా గమనిస్తారో అదేవిధంగా ఇప్పుడు దేశ ఆర్థిక స్థితిగతులపై కూడా 'రన్నింగ్ కామెంటరీ'ని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. భారతీయులలో పెరుగుతున్న ఆకాంక్షలు, ఆత్మవిశ్వాసానికి ఈ అపూర్వమైన ఉత్సుకత నిదర్శనమన్న ఆయన.. ఇదే దేశంపై ఉన్న అంతర్జాతీయ నమ్మకానికి పునాది అని అన్నారు. భారత పురోగతిపై ప్రపంచం కళ్లు ఉన్నాయని.. ఈ వేగాన్ని కొనసాగించాల్సిన బాధ్యత ప్రజలందరికీ పెరిగిందని శ్రీ నరేంద్ర మోదీ ప్రధానంగా చెప్పారు. "ఎన్నో అంచనాలు ఉండి ప్రపంచం మన దేశం వైపు చూస్తున్నప్పుడు మన బాధ్యత గణనీయంగా పెరుగుతుంది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

ప్రపంచ స్థాయి భౌతిక, డిజిటల్ ఆస్తుల సృష్టి ద్వారా ఆధునిక భారత్ కేవలం పురోగతి సాధించడం మాత్రమే కాకుండా 'తదుపరి స్థాయి'కి చురుకుగా ఎదుగుతోందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సాధించిన వేగవంతమైన పరిణామం దేశ ఆర్థిక వ్యవస్థను ఒక కొత్త దశలోకి తీసుకెళ్లిందని.. తద్వారా తక్షణ డిజిటల్ లావాదేవీలలో భారత్‌ను ప్రపంచ దేశాలకే అగ్రగామిగా నిలిపిందని ఆయన పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలలో వచ్చిన ఈ మార్పు మరింత అనుసంధానమైన, సమర్థవంతమైన ఆర్థిక వ్యవస్థకు ఒక ఉత్ప్రేరకంలా పనిచేస్తోందన్నారు. "నేడు ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన తక్షణ డిజిటల్ చెల్లింపులు జరుగుతున్న దేశంగా భారత్ అవతరించింది" అని ప్రధానమంత్రి అన్నారు.

ఆధునిక భారత్ ప్రస్తుతం 'తదుపరి తరం సంస్కరణల' దిశగా అత్యంత వేగంగా దూసుకుపోతోందన్న ప్రధానమంత్రి.. గతంలో అసాధ్యమని భావించిన అనేక నిర్ణయాలను విజయవంతంగా దేశం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు, జన్ ధన్ ఖాతాల ద్వారా 50 కోట్ల మందికి పైగా పౌరులను బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేర్చడం, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని ఆమోదించడం వంటి చారిత్రాత్మక విజయాలను ప్రధాని మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంతరిక్షం, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాలలో ప్రత్యేక మిషన్ల ద్వారా భారత్ గతంలో ఉన్న సాంకేతిక పరిమితులను చెరిపివేసిందని ఆయన తెలిపారు. "నేడు మూన్ మిషన్, సెమీకండక్టర్ మిషన్, క్వాంటం మిషన్లు భారత్‌ను అధునాతన సాంకేతిక వైపు తీసుకెళ్తున్నాయి" అని ప్రధాని వ్యాఖ్యానించారు.

కేవలం ఆకాంక్షలు మాత్రమే ఉండే దశను దాటుతూ భారత్ ఇప్పుడు తన లక్ష్యాలను ఖచ్చితంగా అమలు చేసే, సాకారం చేసుకునే దశకు చేరుకుందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. దేశ పురోగతిలో వచ్చిన ఈ మార్పును ప్రపంచం కూడా గుర్తించిందని.. దేశ వృద్ధి ఇకపై స్వల్ప మార్పులకే పరిమితం కాకుండా విప్లవాత్మకమైన మార్పుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అన్ని రంగాల్లో తన చిరకాల కలలను స్పష్టమైన విజయాలుగా మారుస్తున్న ఒక దేశాన్ని ఈ కొత్త వాస్తవం సూచిస్తోంది. "భారతదేశం కేవలం పురోగతి సాధించడం మాత్రమే కాదు.. తదుపరి స్థాయికి దూసుకుపోతోంది" అని ప్రధాని అన్నారు.

కరోనా మహమ్మారి, ప్రస్తుత అంతర్జాతీయ సంఘర్షణల వంటి ఆకస్మిక ప్రపంచ మార్పులను ఎదుర్కోవడంలో ఒక దేశం చూపే పట్టుదల ఆధారంగానే ఆ దేశ అభివృద్ధి ఉంటుందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. సమీప దేశాల్లో జరుగుతున్న ప్రస్తుత యుద్ధం ప్రపంచవ్యాప్త ఇంధన సంక్షోభానికి దారితీసిందన్న ప్రధాని.. ఇది జాతీయ వ్యక్తిత్వానికి ఒక క్లిష్టమైన పరీక్ష వంటిదని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులను శాంతి, సహనం, ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా ఎదుర్కోవాలని ఆయన సూచించారు. రాజకీయ పార్టీలు, మీడియా, పరిశ్రమల ఉమ్మడి బాధ్యతను గుర్తు చేసిన ఆయన.. మహమ్మారి సమయంలో మనం చూపిన సమష్టి కృషి భారత్ బలాన్ని రెట్టింపు చేసిన తీరును ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవడానికి కూడా అదే విధమైన సహకార స్ఫూర్తి అవసరమని పిలుపునిచ్చారు. "మనం జాతీయ ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమష్టి కృషితో మన బాధ్యతలను నిర్వహించాలి" అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు.

ఎల్పీజీకి విషయంలో జరుగుతున్న చర్చల గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో తప్పుడు సమాచారం కంటే వాస్తవాలకే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతమైన రీతిలో చర్చలు జరగాలని ప్రధానమంత్రి కోరారు.

ప్రస్తుత ప్రపంచ సంఘర్షణల ప్రభావం ప్రతి దేశంపై పడిందన్న ప్రధానమంత్రి.. దీనికి ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం బహుళ స్థాయిల్లో చురుకైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సంక్లిష్ట పరిస్థితులను అధిగమించడానికి, ప్రపంచ సంక్షోభానికి శాశ్వత పరిష్కారాలను కనుగొనడానికి తాను ప్రపంచ అగ్రనేతలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు శ్రీ నరేంద్ర మోదీ వెల్లడించారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులలో ఏర్పడిన వివిధ అంతరాయాలను పరిష్కరించడానికి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని ఆయన ఉద్ఘాటించారు. "సరఫరా గొలుసులో తలెత్తిన అడ్డంకులను మనం ఎలా అధిగమించగలమనే దానిపై నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని ఆయన స్పష్టం చేశారు.

భారత ఇంధన భద్రత కోసం ప్రధానమంత్రి రెండు అంచెల వ్యూహాన్ని వివరించారు. దేశాభివృద్ధి వేగవంతం కావడానికి స్వదేశీ మౌలిక సదుపాయాల విస్తరణ, విదేశీ ఆధారితాన్ని తగ్గించడంపై ఆయన దృష్టి సారించారు. గ్యాస్ రంగం వృద్ధిని విశ్లేషిస్తూ.. 2014లో 14 కోట్లుగా ఉన్న ఎల్పీజీ కనెక్షన్లు నేడు సుమారు 33 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. ఇది మెజారిటీ భారతీయ గృహాలకు లబ్ధి చేకూరుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ విస్తరణకు మద్దతుగా బాట్లింగ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడం, ఎల్ఎన్‌జీ టెర్మినల్స్‌ను రెట్టింపు చేయడం.. గ్యాస్ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను 3,500 కిలోమీటర్ల నుంచి 10,000 కిలోమీటర్లకు విస్తరించడం వంటి చర్యలను ఆయన ప్రముఖంగా చెప్పారు. అంతర్జాతీయంగా దిగుమతి చేసుకుంటున్న 60 శాతం ఎల్పీజీని సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రధాన ఓడరేవుల వద్ద దిగుమతి టెర్మినల్ సామర్థ్యాలను ప్రభుత్వం భారీగా పెంచిందని తెలిపారు. "భారతదేశ వేగవంతమైన అభివృద్ధి కోసం విభిన్న ఇంధన వనరులను ప్రోత్సహించడం, ఇంధన రంగంలో స్వయం సమృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం నిరంతరం అవసరం" అని ఆయన వ్యాఖ్యానించారు.

పట్టణ ఇంధన రంగంలో వచ్చిన భారీ మార్పులను ప్రధాన మంత్రి ప్రస్తావించారు. 2014 కంటే ముందు కేవలం 25?26 లక్షల ఇళ్లకే పరిమితమైన పీఎన్‌జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) కనెక్షన్లు నేడు 1.25 కోట్లకు పైగా గృహాలకు విస్తరించాయని ఆయన పేర్కొన్నారు. పర్యావరణహిత రవాణా దిశగా వచ్చిన మార్పును ప్రస్తావిస్తూ.. సీఎన్‌జీ వాహనాల సంఖ్య 10 లక్షల కంటే తక్కువ నుంచి 70 లక్షల పైచిలుకు పెరిగిందని తెలిపారు. గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 600 కంటే ఎక్కువ జిల్లాల్లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేయడం వల్లే ఈ పురోగతి సాధ్యమైందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. "గత పదేళ్లలో దేశంలోని 600 కంటే ఎక్కువ జిల్లాల్లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లు ఏర్పడటం వల్లే ఇది సాధ్యమైంది" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

ప్రస్తుత ప్రపంచ అనిశ్చితి ముఖ్యంగా కీలక రంగాలలో జాతీయ స్వయం సమృద్ధి సాధించాల్సిన వ్యూహాత్మక అవసరాన్ని ప్రముఖంగా తెలియ జేసిందని ప్రధానమంత్రి అభిప్రాయపడ్డారు. భారత ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, బాహ్య సంక్షోభాల ప్రభావాన్ని తగ్గించడానికి గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం ఒక సమగ్ర విధానాన్ని అనుసరిస్తోందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్పుల వల్ల దేశ పురోగతికి ఎటువంటి అంతరాయం కలగకుండా చూడటమే ఈ సమగ్ర వ్యూహానికి ఉన్న ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. "ఏ దేశానికైనా స్వయం సమృద్ధిగా ఉండటం ఎందుకు అంత ముఖ్యమో ఈ ప్రపంచ సంక్షోభం మరోసారి నిరూపించింది"అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

పెట్రోలియంపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఇథనాల్, జీవ ఇంధనాలపై ప్రభుత్వం అనుసరిస్తోన్న వ్యూహాత్మక దృష్టిని ప్రధానమంత్రి ప్రస్తావించారు. 2014 కంటే ముందు కేవలం 1?1.5 శాతంగా ఉన్న ఇథనాల్ బ్లెండింగ్ నేడు దాదాపు 20 శాతానికి చేరుకుందని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల గత 11 ఏళ్లలో అదనంగా 18 కోట్ల బారెళ్ల చమురును కొనుగోలు చేయాల్సిన అవసరం తప్పిందని.. ఇది జాతీయ నిల్వలను గణనీయంగా బలోపేతం చేసిందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈ మార్పు వల్ల భారత్ తన వార్షిక చమురు దిగుమతులను సుమారు 4.5 కోట్ల బారెళ్ల వరకు తగ్గించుకోగ లుగుతోందని.. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరిందని ప్రధాని తెలిపారు. "ఇథనాల్ బ్లెండింగ్ ద్వారానే దేశం సుమారు లక్షన్నర కోట్ల రూపాయలను ఆదా చేసింది" అని ఆయన స్పష్టం చేశారు.

జాతీయ ఇంధన పొదుపుపై రైల్వే విద్యుదీకరణ, పునరుత్పాదక ఇంధనం చూపుతున్న విప్లవాత్మక ప్రభావాన్ని ప్రధానమంత్రి చెప్పారు. 2014 నాటికి కేవలం 20 శాతం రైల్వే నెట్‌వర్క్ మాత్రమే విద్యుదీకరణ అయి ఉండగా నేడు దాదాపు 100 శాతం బ్రాడ్-గేజ్ నెట్‌వర్క్ విద్యుత్‌తో నడుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇదొక్కటే 2024-25లో భారతీయ రైల్వేకు సుమారు 180 కోట్ల లీటర్ల డీజిల్‌ను ఆదా చేసిందని.. తద్వారా ముడి చమురు దిగుమతుల అవసరాన్ని గణనీయంగా తగ్గించిందని ఆయన తెలిపారు. హరిత ఇంధన విప్లవాన్ని మరింతగా వివరిస్తూ.. భారత పునరుత్పాదక ఇంధన సామర్థ్యం చారిత్రాత్మకమైన 250 గిగావాట్లకు చేరుకుందని తెలిపారు. ఇందులో సౌరశక్తి సామర్థ్యం ఒక్కటే నేడు 130 గిగావాట్లకు పెరిగిందన్న ఆయన.. 2014లో ఇది 2 గిగావాట్లు మాత్రమేనని అన్నారు. 30 లక్షల కుటుంబాలకు పైకప్పు సౌర ఫలకాల ద్వారా విద్యుత్తును అందించిన 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' విజయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. "నేడు మన మొత్తం పునరుత్పాదక సామర్థ్యం 250 గిగావాట్ల చారిత్రక మైలురాయిని దాటింది. మన మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో సగం ఇప్పుడు పునరుత్పాదక వనరుల నుంచే వస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

సామర్థ్య పెంపుదల, 'వ్యర్థాల నుంచి ఇంధనం' తయారీలో ప్రభుత్వం చేస్తున్న పటిష్ఠమైన ప్రయత్నాలను ప్రధానమంత్రి వివరించారు. గోబర్ధన్ పథకం కింద ప్రస్తుతం 100కు పైగా కంప్రెస్డ్ బయో-గ్యాస్ (సీబీజీ) కేంద్రాలు పని చేస్తున్నాయని.. మరో 600 కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 2014 కంటే ముందు నామమాత్రంగా ఉన్న చమురు నిల్వ సామర్థ్యాన్ని నేడు 50 లక్షల టన్నులకు పైగా 'వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు' సృష్టించడం ద్వారా జాతీయ భద్రతలో వచ్చిన గణనీయమైన మార్పును ప్రధాని మోదీ తెలియజేశారు. గత దశాబ్ద కాలంలో వార్షిక చమురు శుద్ధి సామర్థ్యాన్ని 40 మిలియన్ టన్నుల కంటే ఎక్కువగా పెంచడం వల్ల భారత్ ప్రపంచ చమురు శుద్ధి కేంద్రంగా ఎదిగిందని ప్రధాని గుర్తు చేశారు. ఈ నిర్మాణాత్మక బలాలు ప్రస్తుత ప్రపంచ ఇంధన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి దేశానికి సహాయపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. "ఈ యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని మనం ఖచ్చితంగా ఎదుర్కోగలం. భారత్‌ను భారీ స్థాయిలో స్వయం సమృద్ధిగా మార్చే దిశగా మన పనిని కొనసాగిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు.

ప్రస్తుత ప్రపంచ అనిశ్చితులను ఎదుర్కోవడంలో భారత్‌లోని 140 కోట్ల మంది ప్రజల సమష్టి బలంపై ప్రధానమంత్రి ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మహమ్మారి సమయంలో దేశం చూపిన ఐక్య ప్రతిస్పందనను గుర్తు చేసిన ఆయన.. అదే విధమైన క్రమశిక్షణ, పట్టుదల ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాన్ని అధిగమించేలా చేస్తాయని పేర్కొన్నారు. దేశ పురోగతిని కాపాడటానికి తన ప్రభుత్వం అవిశ్రాంత సేవ, చురుకైన చర్యలకు కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. "వేం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ ప్రజా ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యత ఉంటుంది" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

అంతర్జాతీయ సంఘర్షణల ప్రభావం ప్రపంచ మార్కెట్, ప్రపంచవ్యాప్తంగా ప్రజలపై ఇంకా కొనసాగుతున్నప్పటికీ భారత ప్రభుత్వం మాత్రం తన ప్రజలను ఈ బాహ్య ఒత్తిళ్ల నుంచి రక్షించడానికి నిరంతరం కృషి చేస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభాన్ని ఉదాహరణగా ప్రస్తావించిన ఆయన.. దేశీయంగా ధరలు పెరగకుండా ఉండటానికి ప్రభుత్వం నిత్యావసర వస్తువులపై భారీగా రాయితీలు అందించిందని గుర్తు చేశారు. అంతర్జాతీయంగా యూరియా ధర ఒక్కో బస్తాకు రూ. 3000కి చేరుకున్న సమయంలో కూడా వ్యవసాయ స్థిరత్వాన్ని కాపాడటం కోసం ప్రభుత్వం రైతులకు కేవలం రూ. 300 నామమాత్రపు ధరకే అది అందేలా చూసిందని ఆయన వివరించారు. "ఈ సారి కూడా యుద్ధ ప్రభావం దేశంలోని రైతులు, ప్రజల జీవితాలపై వీలైనంత తక్కువగా ఉండేలా చూడటమే మా ప్రతి ప్రయత్నం" అని ఆయన అన్నారు.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. సమన్వయంతో పనిచేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. తప్పుడు సమాచార వ్యాప్తిని అరికట్టడం, అక్రమ వ్యాపార పద్ధతులను నియంత్రించడం సామాజిక, ఆర్థిక స్థిరత్వానికి అత్యంత కీలకమని ఆయన చెప్పారు. కృత్రిమ కొరత లేదా ధరల అవకతవకల నుంచి వినియోగదారులను రక్షించడానికి మార్కెట్ పరిస్థితులపై కఠినమైన పర్యవేక్షణ ఉంచాలని ఆయన స్థానిక అధికారులను కోరారు. "పరిస్థితిని తీవ్రంగా పర్యవేక్షించడం, నల్లబజారుకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం చాలా అవసరం" అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.

సున్నితమైన పాలన, గత ప్రభుత్వాల వల్ల నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలు- వర్గాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా గత దశాబ్ద కాలం ప్రత్యేకతను చాటుకుందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. ఆకాంక్షిత జిల్లాల పథకం, పీఎం జన్మన్ వంటి అంకితభావంతో కూడిన కార్యక్రమాల ద్వారా దేశంలోని అత్యంత మారుమూల ప్రాంతాలకు గృహనిర్మాణం, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం విజయవంతంగా అందించిందని ఆయన పేర్కొన్నారు. అంతర్గత భద్రతలో వచ్చిన విప్లవాత్మక మార్పును ప్రస్తావించిన ఆయన.. 2013లో 180 కంటే ఎక్కువ జిల్లాలు మావోయిస్టు ప్రభావితంగా ఉండగా నేడు ఆ సంఖ్య పది కంటే తక్కువకు పడిపోయిందని అన్నారు. భయాన్ని తొలగించి అభివృద్ధి, సమ్మిళిత వృద్ధిని తీసుకురావాలనే జాతీయ సంకల్పాన్ని ఈ మార్పు ప్రతిబింబిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. "నేడు మావోయిస్టు ఉగ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్య సింగిల్ డిజిట్‌కు చేరుకుంది" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

గత ఏడాది కాలంలో అంతర్గత భద్రతలో సాధించిన భారీ విజయాలను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. 2,100 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోవడం.. 300 మందికి పైగా కరడుగట్టిన మిలిటెంట్లను నిర్వీర్యం చేయడం వల్ల గతంలో సంఘర్షణలతో నిండిన ప్రాంతాల్లో అభివృద్ధి తిరిగి ఊపందుకుందని ఆయన పేర్కొన్నారు. భారత్ పురోగతి ఇప్పుడు అప్రతిహతంగా సాగుతోందన్న ఆయన.. 140 కోట్ల మంది ప్రజల 'తదుపరి స్థాయి' ఆకాంక్షలే దీనికి చోదక శక్తి అని ఉద్ఘాటించారు. ఈ ఆకాంక్షలు దేశానికి భారం కావన్న ఆయన.. వీటిని ప్రజల నమ్మకానికి ఒక గొప్ప పెట్టుబడిగా అభివర్ణించారు. నిరంతర ప్రజల ఆశీస్సులతో స్వయం సమృద్ధి, అభివృద్ధి చెందిన దేశం అనే జాతీయ స్వప్నాన్ని నెరవేర్చడానికి తాను కట్టుబడి ఉన్నానని తెలుపుతూ ప్రధాని ప్రసంగాన్ని ముగించారు.

# అస్సాంలోని గువహటిలో రూ. 19,480 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, మార్చి 14:అస్సాంలోని గువహటిలో దాదాపు రూ. 19,480 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభోత్సవాలు, శంకుస్థా పనలు చేశారు. గువహటిలో జరిగిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, నగర ప్రజలకు ప్రధాని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వర్చువల్‌గా పాల్గొంటున్న రైతులకు, అలాగే తేయాకు తోటల్లో పనిచేస్తున్న కార్మికులకు కూడా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నవరాత్రుల ముందు కామాఖ్య మాత పవిత్ర భూమిలో ఉండటం తన అదృష్టమని ప్రధానమంత్రి అన్నారు. “నవరాత్రులు ప్రారంభం కావడానికి సరిగ్గా ముందు, కామాఖ్య మాత పుణ్య భూమిలో మిమ్మల్ని దర్శించుకునే భాగ్యం నాకు కలిగింది” అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

కామాఖ్య మాత ఆశీస్సులతో దాదాపు రూ. 19,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కొద్దిసేపటి క్రితమే శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో పాటు, రాష్ట్రానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యాలను పెంచే అనేక ప్రాజెక్టులు అస్సాంకు దక్కాయని ఆయన అన్నారు. ఈ రోజు దేశ రైతులకు, అస్సాం తేయాకు తోటల కార్మికులకు ఎంతో ముఖ్యమైన రోజని ప్రధానమంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది అన్నదాతల ఖాతాల్లోకి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ. 18,000 కోట్లకు పైగా నిధులను నేరుగా జమ చేసినట్లు శ్రీ మోదీ సభలో తెలియజేశారు. అస్సాం తేయాకు తోటలకు చెందిన అనేక కుటుంబాలకు భూ పట్టాలు పంపిణీ చేసినట్లు ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. “అస్సాం ప్రజలకు, ఇక్కడి కుటుంబాలందరికీ, దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను” అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

కామాఖ్య మాత పవిత్ర భూమి నుంచి జరుగుతున్న ఈ కార్యక్రమంలో దేశవ్యాప్త రైతులు భాగస్వాములయ్యారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కోట్లాది మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధి జమ అయినట్లు ఇప్పటికే వారికి సందేశాలు అందాయని శ్రీ మోదీ తెలిపారు. ఈ పథకం నిజంగా అసాధారణమైనదని ప్రధాని అభివర్ణించారు. 2014 సంవత్సరానికి ముందు రైతు సోదర సోదరీమణులలో అధికశాతం మంది వద్ద మొబైల్ ఫోన్ కానీ, బ్యాంక్ ఖాతా కానీ లేవని శ్రీ మోదీ గుర్తు చేశారు. ఇప్పటివరకు కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.4.25 లక్షల కోట్లకు పైగా నగదు జమ అయినట్లు ప్రధాన మంత్రి వివరించారు. ఒక్క అస్సాంలోనే సుమారు 19 లక్షల మంది రైతులు ఇప్పటిదాకా దాదాపు రూ.8.000 కోట్లు అందుకున్నారని ప్రత్యేకంగా గుర్తుచేశారు. “ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు కూడా దీనిని అందుకోలేవు; ఒక్క క్లిక్‌తో కోట్ల మంది రైతులకు నేరుగా డబ్బు చేరుతోంది” అని శ్రీ మోదీ చెప్పారు.

”సమ్మాన్ నిధి పథకం నేడు దేశంలోని చిన్న రైతులకు సామాజిక భద్రత కల్పించే సాధనంగా మారింది,” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వానికి రైతుల సంక్షేమం కంటే ముఖ్యమైనది మరేదీ లేదని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. గత 10 ఏళ్లలో రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) రూపంలో రూ.20 లక్షల కోట్లకు పైగా నిధులు అందాయని ఆయన పేర్కొన్నారు.

గత 11 ఏళ్లలో ప్రస్తుత ప్రభుత్వం దేశ రైతులకు ఒక బలమైన రక్షణ కవచం ఏర్పాటు చేసిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కనీస మద్దతు ధర, తక్కువ వడ్డీ రుణాలు, పంట బీమా లేదా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు రైతులకు భారీ మద్దతు వ్యవస్థగా మారాయని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావం వ్యవసాయం, సాగుపై పడకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి, ఆ తర్వాత జరిగిన యుద్ధాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు అనేక రెట్లు పెరిగాయని, విదేశీ మార్కెట్ల నుంచి ఎరువులు సేకరించడం అత్యంత కష్టతరంగా మారిందని శ్రీ మోదీ అన్నారు. ఈ సంక్షోభం నుంచి న రైతులను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందని ప్రధానమంత్రి చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.3,000 ధర పలికే యూరియా బస్తాను తమ ప్రభుత్వం రైతులకు కేవలం రూ.300 కే అందించిందని ఆయన గుర్తు చేశారు. “ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరల పెరుగుదల భారం మన రైతులపై పడకుండా ఉండేందుకు ప్రభుత్వం తన ఖజానా నుంచి రూ.12 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసింది” అని శ్రీ మోదీ వివరించారు.

గత దశాబ్ద కాలంలో ప్రస్తుత ప్రభుత్వం స్వయంసమృద్ధి దిశగా ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రధానమంత్రి చెప్పారు. బాహ్య సంక్షోభాల నుంచి వ్యవసాయాన్ని రక్షించడా నికి స్వయం సమృద్ధిని ప్రోత్సహిం చినట్లు పేర్కొన్నారు. ప్రపంచం లోని ఇతర ప్రాంతాల్లో యుద్ధాలు లేదా సరఫరా వ్యవస్థల్లో అంత రాయాలు ఏర్పడినప్పుడు భారతీ య రైతులు పదేపదే కష్టాలు ఎదుర్కోవడం చూశామని, కొన్ని సార్లు ఎరువుల ధరలు పెరగడం, మరి కొన్నిసార్లు డీజిల్, ఇంధన ధరలు ఆకాశాన్ని తాకడం జరిగి ందని ప్రధానమంత్రి వివరిం చారు

ప్రభుత్వ లక్ష్యం వ్యవసాయాన్ని సరికొత్త సాంకేతికతతో అనుసంధానించడం, రైతులను నూతన సాగు పద్ధతులతో ముడిపెట్టడం, పంటలకు మేలు చేకూర్చడమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం ‘పర్ డ్రాప్ మోర్ క్రాప్’ (ప్రతి నీటి చుక్కకు ఎక్కువ పంట) విధానాన్ని అవలం బించిందని, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తెచ్చిందని శ్రీ మోదీ తెలిపారు. దీని వల్ల సాగు నీటి సౌకర్యం మెరుగుపడటమే కాకుండా ఖర్చులు కూడా తగ్గాయని ప్రధా నమంత్రి ప్రముఖంగా ప్రస్తావిం చారు. డీజిల్ కోసం రైతులు పెట్టే ఖర్చును తగ్గించడానికి పొలాలను సోలార్ పంపులతో అనుసం ధానించే పనిలో ప్రభుత్వం ఉందని శ్రీ మోదీ తెలిపారు. ఇందుకోసమే కేంద్రం ‘కుసుమ్’ యోజనను రూపొందించిందని ప్రధాని పేర్కొన్నారు. “నేడు చాలా మంది రైతులు సోలార్ పంపుల ద్వారా సాగు చేయడమే కాకుండా, విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ దాని ద్వారా ఆదాయాన్ని కూడా పొందుతున్నారు” అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

ఎరువులు, పురుగుల మందులపై రైతుల ఆధారపడటాన్ని తగ్గించడానికి ప్రభుత్వం నిరంతర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాన మంత్రి తెలిపారు. మూతపడిన ఎరువుల కర్మాగారాలను ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించిందని, రైతులను నానో యూరియా తో అనుసంధానించడానికి అనేక చర్యలు చేపట్టిందని, నేడు దేశంలోని రైతులు దాని ప్రయోజనాలను పొందుతున్నారని శ్రీ మోదీ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేలా ప్రస్తుత ప్రభుత్వం ఇప్పుడు రైతులను ప్రోత్సహిస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. “రైతులు భారీ ఎత్తున ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టినప్పుడు, నేల సురక్షితంగా ఉంటుంది. వారు ప్రపంచ సంక్షోభాల నుంచి కూడా బయట పడతారు” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, దేశాన్ని స్వయం సమృద్ధిగా మారుస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశంలో రిఫైనరీల అభివృద్ధికి, వాటి సామర్థ్యాన్ని విస్తరించడానికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేసిందని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. నేడు, దేశీయంగా రిఫైనరీ సామర్థ్యం పెరగడమే కాకుండా, పెట్రోకెమికల్ రంగంలో కూడా భారత్ వేగంగా దూసుకుపోతోందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. భారత్ నేడు తన సొంత ఇంధన అవసరాలనే కాకుండా, ప్రపంచ ఇంధన అవసరాలను కూడా తీర్చగల సామర్థ్యం ఉన్న దేశమని శ్రీ మోదీ పేర్కొన్నారు.

## విధానపరమైన చర్చలకు, ఆవిష్కరణలకు, అంతర్జాతీయ సహకారానికి కీలక వేదికగా ఎదుగుతున్న ఎన్ఎక్స్‌టీ 2026 సమ్మేళనం: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, మార్చి 14:న్యూఢిల్లీలో జరిగిన ఎన్ఎక్స్‌టీ సమావేశం 2026కు హాజరైన 30కి పైగా దేశాల పార్లమెంటేరియన్లు, పారిశ్రామికవేత్తలు, మేధావులతో కూడిన ప్రతినిధి బృందం నేడు పార్లమెంట్ భవనంలో లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా శ్రీ బిర్లా మాట్లాడుతూ.. వివిధ ప్రజాస్వామ్య దేశాల ప్రజాప్రతినిధులకు, ఇతర ప్రముఖులకు పార్లమెంటు భవనంలో ఆతిథ్యం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ పార్లమెంటరీ చర్చల ప్రాముఖ్యతను ఆయన వివరించారు.

విధానపరమైన చర్చలు, ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారానికి ముఖ్యమైన వేదికగా అభివృద్ధి చెందుతున్న ఎన్ఎక్స్‌టీ 2026 సమావేశ కార్యక్రమానికి నాయకత్వం వహించినందుకు రాజ్యసభ ఎంపీ శ్రీ కార్తికేయ శర్మను శ్రీ బిర్లా అభినం దించారు. సమకాలీన ప్రపంచ సవాళ్లు, అవకాశాలపై చర్చించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పార్లమెంటేరియన్లను, విధాన రూపకర్తలను, మేధావులను ఈ సదస్సు ఒకచోటకు చేర్చిందని శ్రీ బిర్లా పేర్కొన్నారు.

దేశ ప్రజాస్వామ్య వారసత్వాన్ని వివరిస్తూ.. చర్చలు, ఏకాభిప్రాయం, భాగస్వామ్య నిర్ణయానికున్న సుదీర్ఘ సంప్రదాయం కారణంగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను తరచుగా “ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు” గా పిలుస్తారు. 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్షలు, వైవిధ్యానికి భారత పార్లమెంటు ప్రాతినిధ్యం వహిస్తుందని శ్రీ బిర్లా తెలిపారు. ఇక్కడి విధానాలు విభిన్న దృక్పథాల మధ్య చర్చలు, సంభాషణల ద్వారా రూపొందుతాయని అన్నారు.

గడిచిన దశాబ్ద కాలంలో సమ్మిళిత అభివృద్ధి, డిజిటల్ ఆవిష్కరణలు, సుపరిపాలనలో భారత్ సాధించిన పురోగతిని శ్రీ బిర్లా ప్రస్తావించారు. సాంకేతికత ఆధారిత పాలన, ప్రత్యక్ష నగదు బదిలీ విధానాలు, డిజిటల్ వేదికల ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని గణనీయంగా బలోపేతం చేశాయని ఆయన పేర్కొన్నారు.

డిజిటల్ సంసద్, మెరుగైన పార్లమెంటరీ పరిశోధన వ్యవస్థలు, ఆధునిక సమాచార వేదికల వంటి కార్యక్రమాల ద్వారా పార్లమెంటరీ ప్రక్రియలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంపొందించడానికి కొత్త సాంకేతికతలు, కృత్రిమ మేధ వినియోగంపై భారత్ దృష్టి సారించిందని శ్రీ ఓం బిర్లా నొక్కి తెలిపారు.

పార్లమెంటరీ దౌత్యం ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాసనసభలతో సంబంధాలను, సహకారాన్ని బలోపేతం చేయడానికి భారత పార్లమెంటు ఇటీవల 60కి పైగా పార్లమెంటరీ మైత్రీ బృందాలను ఏర్పాటు చేసిందని స్పీకర్ తెలిపారు.

# గోసంరక్షణకు రూ.1 లక్ష విరాళం..



అమరావతి, మార్చి 14:విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం గో సంరక్షణ కోసం గోసంరక్షణ పథకానికి భక్త కుటుంబం రూ.1 లక్ష విరాళాన్ని అందజేసింది.

భక్తురాలు పి. సుభాషిణి కుటుంబ సభ్యులు మాధవరావు, రేవంత్ సాయి చౌదరి, హేమంత్ సాయి చౌదరి, రామబాబు, వరలక్ష్మ దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ కార్యక్రమానికి రూ.1,00,000 విరాళంగా సమర్పించారు.

దుర్గగుడి చైర్మన్ బొర్రా గాంధీని కలిసి దాతలు విరాళాన్ని అందజేశారు. వీరికి ఆలయ అధికారుల అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేయక వేద ఆశీర్వచనమంతరావు అధికారులు అమ్మవారి చిత్రపటం రసీదు ప్రసాదాలు అందజేశారు.

# మహారాష్ట్రలోని భద్రావతిలో రెండు సమగ్ర బొగ్గు గ్యాసిఫికేషన్ ప్లాంట్లకు భూమి పూజ చేయనున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 14:కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి 2026, మార్చి 13, 14 తేదీల్లో నాగ్‌పూర్‌లోని వెస్ట్రన్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్) సందర్శనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా, రెండు సమగ్ర బొగ్గు గ్యాసిఫికేషన్ ప్లాంట్లకు శ్రీ కిషన్ రెడ్డి భూమి పూజ చేస్తారు. ముర్పార్ గని మూసివేత (మైన్ క్లోజర్) స్థలాన్ని మంత్రి పరిశీలిస్తారు. సంబంధిత భాగస్వాములతో మైన్ క్లోజర్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తారు.

2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ చేయడం లక్ష్యంగా బొగ్గు గ్యాసిఫికేషన్ మిషన్ ఏర్పాటయింది. తద్వారా ఈ కీలకమైన వనరు విలువను, ప్రయోజనాన్ని గరిష్ట స్థాయికి చేర్చడం, అలాగే స్వచ్ఛమైన ఇంధన పరిష్కారాలను అనుసరించడం, బొగ్గు సుస్థిర వినియోగాన్ని నిర్ధారించడం దీని ఉద్దేశ్యం.

దేశంలో బొగ్గు గ్యాసిఫికేషన్‌ను ప్రోత్సహించడానికి 2024 జనవరిలో రూ. 8,500 కోట్ల ఆర్థిక ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించారు. ఈ చొరవ ద్వారా యూరియా, సహజ వాయువు, ఇథనాల్, కోకింగ్ కోల్ వంటి వాటి దిగుమతుల స్థానంలో స్వదేశీ ఉత్పత్తులను భర్తీ చేయడానికి వీలు కలుగుతుంది. ఇది బొగ్గు వనరుల వినియోగాన్ని కూడా వేగవంతం చేస్తుంది.

బొగ్గు గ్యాసిఫికేషన్ కోసం నిర్దేశించిన దార్శనికత ఇప్పుడు కార్యరూపం దాలుస్తోంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి చంద్రపూర్‌లోని భద్రావతి పారిశ్రామిక ప్రాంతంలో రెండు ప్రైవేట్ సంస్థలైన గ్రేటా ఎనర్జీ అండ్ మెటల్ ప్రైవేట్ లిమిటెడ్, న్యూ ఎరా క్లీన్‌టెక్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టులకు భూమి పూజ నిర్వహించి, శంకుస్థాపన చేయనున్నారు. భారత ప్రభుత్వ పథకం కింద ఆర్థిక ప్రోత్సాహకాలు పొందేందుకు ఎంపికైన ఏడు ప్రాజెక్టులలో ఈ రెండు ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.

గ్రేటా ఎనర్జీ అండ్ మెటల్ ప్రైవేట్ సంస్థ డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్ (డీఆర్ఐ) ఉత్పత్తి కోసం బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. న్యూ ఎరా క్లీన్‌టెక్ సొల్యూషన్ ప్రైవేట్ సంస్థ అమ్మోనియం నైట్రేట్, హైడ్రోజన్ ఉత్పత్తి కోసం బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టును నిర్మిస్తోంది.

# రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి..

### -డాక్ యార్డ్ మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

### -భారీగా రక్తదానం చేసిన-ఉద్యోగులు-90 యూనిట్ల రక్తం సేకరణ



అమరావతి, మార్చి 14: దేశవ్యాప్తంగా రక్త నిల్వలు ఎంతో అవసరమని, కాబట్టి ప్రతి ఒక్కరూ సమాజ బాధ్యతగా భావించి రక్తదానం చేసి ప్రాణదాతలు గా నిలవాలని ప్రభుత్వ విప్..విశాఖ పశ్చిమ శాసనసభ్యులు గణబాబు పిలుపునిచ్చారు.. శనివారం ఎన్ఏడి జంక్షన్ కళాక్షేత్రంలో డాక్ యార్డ్ కేటిబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.. తొలుత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గణబాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని.. వాటిని తగ్గించడంతోపాటు ఎక్కడికక్కడ అవసరమైన మేరకు రక్త నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు..

అలా చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అందువల్ల యువత ఎక్కువగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని గణబాబు కోరారు. మనం చేసే రక్తదానం ఎంతో మందికి ప్రాణం నిలబెడుతుందన్నారు. సామాజిక సేవలో డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ ముందు వరుసలో ఉందన్నారు.. రక్షణ రంగంలో విధులు నిర్వహిస్తూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

అసోసియేషన్ భవనాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు.. అలాగే అధికారుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి. సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం ఉంటుందన్నారు. అన్ని కార్యక్రమాల్లో తనను భాగస్వామ్యం చేయడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు.. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా హాజరైన గాజువాక బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బండి యశోదర వేదమణి ,ప్రముఖ గైనకాలజిస్ట్..లక్ష్మి కొండమ్మ బొత్స లు మాట్లాడుతూ సమాజానికి ఎంతో ఉపయోగకరమైన ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు .

ఇందుకు కృషి చేస్తున్న డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ సభ్యుల సేవలు ప్రశంసనీ యమన్నారు.. మెగా రక్తదాన శిబిరంలో తమను కూడా భాగస్వాములు చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షులు బత్తుల చిరంజీవి లు మాట్లాడుతూ అందరి సహకారంతోనే అసోసియేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామ న్నారు ఇప్పటికే విద్య ప్రోత్సాహ కాలు.. వైద్య .. రక్తదాన శిబిరా లు.. వన సమారాధన.. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామన్నారు.విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో సుమారు 90 యూనిట్ల రక్తం సేకరించారు.. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకురాలు ఎస్. రాజకుమారి.. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్.. కోశాధికారి గంర్రెడ్డి శ్రీనివాసరావు.. అదనపు కార్యదర్శి రాజకుమార్ సభ్యులు రమణ ..సన్యాసిరావు కాలనీ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు తదితరులతో పాటు పెద్ద ఎత్తున సభ్యులంతా పాల్గొన్నారు..

# క్యాప్టివ్, వాణిజ్య, ఇతర గనుల నుంచి రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి

న్యూఢిల్లీ, మార్చి 14:భారత బొగ్గు రంగం 2025?26 ఆర్థిక సంవత్సరంలో మార్చి 11, 2026న క్యాప్టివ్, కమర్షియల్, ఇతర గనులు బొగ్గు ఉత్పత్తిలో 200 మిలియన్ టన్నుల మైలురాయిని దాటడం ద్వారా కీలక విజయం సాధించింది. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగ భాగస్వాముల సమష్టి కృషి, అచంచలమైన నిబద్ధతను ఈ విజయం ప్రతిబింబిస్తుంది.

వారి అవిశ్రాంత కృషి, సమర్థత దేశంలో బొగ్గు ఉత్పత్తిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాయి.

మొత్తం ఉత్పత్తిలో క్యాప్టివ్, వాణిజ్య బొగ్గు గనులు 194.17 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించగా, ఇతర గనులు 6.06 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేశాయి. దీంతో మొత్తం ఉత్పత్తి చరిత్రాత్మక 200 మిలియన్ టన్నుల మార్కును దాటింది

. ముఖ్యంగా, 2025 -26 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి... 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తం ఉత్పత్తి (197. 32 మిలియన్ టన్నులు)ని మార్చి 07, 2026నే అధిగమించింది. అంటే గత సంవత్సరం కంటే 24 రోజులు ముందుగానే ఈ మైలురాయిని సాధించింది. ఈ రంగం బలమైన ఊపును ప్రదర్శిస్తూనే ఉంది. అదే సమ యంలో 10.56 శాతం వార్షిక వృద్ధినీ నమోదు చేసింది.

బొగ్గు సరఫరా కూడా స్థిరమైన వృద్ధి పథాన్ని కొనసాగి స్తోంది. ఇది 7.71 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తూ... 182.98 మిలియన్ టన్నుల నుంచి 197.09 మిలియన్ టన్నులకి పెరిగింది. ఈ నిరంతర ఉత్పత్తి పెరుగుదల దేశ ఇంధన అవసరాలను తీర్చడానికి పెరుగుతున్న ఈ రంగం సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. కీలకమైన వినియోగ రంగాలకు నమ్మకమైన బొగ్గు సరఫరాను నిర్ధారిస్తుంది.

# ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### -ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### -పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు

కరీంనగర్, మార్చి 14:పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ఆర్థిక



ఊరట కలిగిస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శనివారం నియోజకవర్గానికి సంబంధించిన వివిధ గ్రామాలకు చెందిన 238 మంది సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ. 75 కోట్ల 88 లక్షల విలువ గల చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పెద్దపల్లి నియోజకవర్గానికి దాదాపు రూ. 1000 కోట్లు పైచిలుకు అభివృద్ధి పనులు మంజూరు చేయడం మన అదృష్టమని, ప్రజల దీవెనలతో గెలిచిన తాను ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసమే నియోజకవర్గంలో ఎక్కడ అవినీతి లేకుండా పాలన సాగిస్తున్నామని అన్నారు. జిల్లా కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణం శరవేగంగా సాగుతోందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలోనే సేవల విషయంలో మొదటి స్థానంలో ఉందన్నారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లు నూగిళ్ల మల్లయ్య, బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ చైర్మన్ లు కూర మల్లారెడ్డి, ప్రకాశ్ రావు, సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న అల్ప్రాజోలమ్ ఫ్యాక్టరీ..

న్యూఢిల్లీ, మార్చి 14:కృత్రిమ ఔషధాలను చట్టవిరుద్ధంగా తయారు చేస్తున్న వర్గాలపై కొరడాను ఝుళిపిస్తూ, రెవిన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) ఆంధ్రప్రదేశ్‌లో యన్‌టీఆర్ జిల్లా కొండపల్లి పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతంలో ఒక రహస్య స్థావరం గుట్టును రట్టు చేసింది. దీంతో, ఎన్‌డీపీఎస్ చట్టం-1985లో ప్రస్తావించిన మానసిక రోగ కారక అల్ప్రాజోలమ్‌ను ఆ చోటులో ఉత్పత్తి చేస్తున్న వైనం తెలిసింది.

గోప్య సమాచారం అందడంతో పక్కా ప్రణాళికను వేసుకొని మరీ "ఆపరేషన్ వైట్ హ్యామర్" అని సంకేత నామంతో దాడులు చేపట్టారు. ఈ ప్రణాళికను 2026 మార్చి నెల 11, 12 తేదీల్లో అమలుచేశారు. అల్ప్రాజోలమ్ తయారీకి ఒక పూర్తి పారిశ్రామిక వ్యవస్థనే నెలకొల్పిన సంగతి బయటపడింది. ఒక రసాయనిక తయారీ విభాగం ముసుగులో, ఈ వ్యవస్థను కొనసాగిస్తున్నట్లు కనుగొన్నారు.

ఆ పరిసరాల్లో సోదాలు చేసి, 237 కిలోల అల్ప్రాజోలమ్ స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ రూ.47 కోట్లు ఉంటుందని అంచనా. దీంతో పాటు 800 కిలోలకు పైగా ముడిపదార్థాలనీ, 2860 లీటర్ల పరిమాణంలో వివిధ రసాయనాలనీ, రియాక్టర్లు, డ్రయ్యర్లు, ఒక సెంట్రిఫ్యూజ్ సహా పెద్ద ఎత్తున పారిశ్రామిక ఉపకరణాలనీ కూడా జప్తు చేశారు. ఈ సాక్ష్యాలు వ్యవస్థీకృత, భారీ చట్టవిరుద్ధ ఉత్పాదన సదుపాయాన్ని వెలుగులోకి తీసుకువచ్చాయి.

రసాయనాలు, ఔషధాల నిర్మాణ రంగంలో 20 సంవత్సరాల కన్నా ఎక్కువ అనుభవం ఉన్న ఒక కెమిస్టు ఈ తతంగాన్ని నడుపుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. అతడు హైదరాబాద్‌లో తన సహచరునితో చేయి కలిపాడు. ఆ వ్యక్తి ముడి పదార్థాలని సమకూర్చడంతో పాటు పంపిణీకి కూడా ఏర్పాట్లు చేశాడు. నిందితులు అల్ప్రాజోలమ్‌ను దొంగచాటుగా తయారు చేయడానికి ఒక ఫ్యాక్టరీ పరిసరాల్ని అద్దెకు తీసుకున్నారు. సూత్రధారులు ఇద్దరినీ అరెస్టు చేశారు.

వర్తమాన ఆర్థిక సంవత్సరంలో, డీఆర్ఐ గోప్య సమాచారాన్ని అందుకొని ముందుకు కదిలి ఎనిమిది రహస్య మందుల తయారీ యూనిట్లను ఛేదించింది. ప్రభుత్వం అమలుపరుస్తున్న 'నశా ముక్త్ భారత్' ఉద్యమం పట్ల, మత్తుమందుల, మానసిక రోగ కారక పదార్థాల బెడద నుంచి సమాజాన్నీ, ప్రజలనీ సురక్షితంగా ఉంచడం పట్ల డీఆర్ఐ దృఢ నిబద్ధతని ఇది చాటిచెబుతోంది.

# కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన గల ఉన్నత స్థాయి సంఘం (హెచ్ఎల్‌సీ) ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 14: వరదలు, ఆకస్మిక వరదలు, మేఘ విస్ఫోటం, కొండచరియలు విరిగిపడటం, 'మొంథా' పెను తుఫాను ప్రభావానికి లోనైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, నాగాల్యాండులతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ, కాశ్మీరుకు కేంద్ర అదనపు సాయంగా రూ.1,912.99 కోట్లు అందించనున్నారు. కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఒక ఉన్నత స్థాయి సంఘం (హెచ్ఎల్‌సీ) దీనికి ఆమోదం తెలిపింది.

ఈ మేరకు కేంద్ర సాయాన్ని జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి అందించారు. ఇది సంవత్సరం ప్రారంభ నిల్వ రూపంలో అందుబాటులో ఉన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్)లో నుంచి 50 శాతం సర్దుబాటుకు లోబడి ఉంటుంది. మొత్తం రూ.1,912.99 కోట్లలో నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రూ.341.48 కోట్లు, ఛత్తీస్‌గఢ్‌కు రూ.15.70 కోట్లు, గుజరాత్‌కు రూ.778.67 కోట్లు, హిమాచల్‌ప్రదేశ్‌కు రూ.288.39 కోట్లు, నాగాల్యాండ్‌కు రూ.158.41 కోట్లు, జమ్మూ, కాశ్మీర్‌కు రూ.3 30.34 కోట్లు మంజూరు చేశారు.

విపత్తులు, ప్రాకృతిక వైపరీత్యాలు సంభవించిన కాలంలో రాష్ట్ర ప్రభుత్వాలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం భుజం భుజం కలిపి నిలబడడంతో పాటు, అవసరమైన అన్ని రకాల సాయాన్నీ అందిస్తోంది.

రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) నుంచి కేంద్రం రాష్ట్రాలకు విడుదల చేసిన పైన ప్రస్తావించిన నిధులకు అదనంగా ఇచ్చిన సాయమిది. ఈ సొమ్మును ఖర్చు చేయడానికి అనువుగా రాష్ట్రాలకు అందజేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 28 రాష్ట్రాలకు రూ.20,735.20 కోట్లను ఎస్‌డీఆర్ఎఫ్ నుంచి విడుదల చేయడంతో పాటు, 21 రాష్ట్రాలకు రూ.3,628.18 కోట్లను ఎన్‌డీఆర్ఎఫ్ నుంచి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది .అదనంగా, 23 రాష్ట్రాలకు రూ.5,373.20 కోట్లను రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి (ఎస్‌డీఎంఎఫ్) నుంచీ, 21 రాష్ట్రాలకు రూ.1,189.56 కోట్లను జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్‌డీఎంఎఫ్) నుంచీ కూడా విడుదల చేశారు.

# రెండు కొత్త పిల్లలతో నాలుగో ఏడాదిలోకి ప్రవేశించిన బట్టమేక పిట్ట పునరుత్పత్తి కార్యక్రమం

న్యూఢిల్లీ, మార్చి 14:గ్రేట్ ఇండియన్ బస్టార్డ్ (జీఐబీ) ప్రాజెక్టు పునరుత్పత్తి కార్యక్రమం నాలుగో ఏడాదిలోకి ప్రవేశించిందని కేంద్రం పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ శుక్రవారం తెలియ జేశారు. రాజస్థాన్లోని కన్జర్వేషన్ బ్రీడింగ్ సెంటర్లో కొత్తగా రెండు పిల్లలను పొదగడంతో ఈ పక్షుల సంఖ్య 70కి చేరుకుందని వెల్లడించారు.

పర్యావరణానికి ప్రాధాన్యమిస్తున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సారథ్యంలో, ఈ ప్రాజెక్టును విజయవంతం చేయడానికి దేశం సరైన మార్గంలో ప్రయాణిస్తోందని మంత్రి అన్నారు.

ఈ పురోగతికి సంబంధించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శ్రీ యాదవ్ పంచుకున్నారు. ప్రాజెక్టు జీఐబీ పరిధిలో సాధించిన మరో విజయంగా దీనిని వర్ణించారు. రాజస్థాన్‌లోని కన్జర్వేషన్ బ్రీడింగ్ సెంటర్లో ఈ వారం సహజ సంపర్క విధానంలో ఒకటి, కృత్రిమ విధానంలో మరొకటి మొత్తం రెండు పిల్లలను పొదిగినట్లు తెలియజేశారు. జీవజాతుల పరిరక్షణ ప్రయత్నాల్లో ప్రధాన విజయంగా దీనిని శ్రీ యాదవ్ వర్ణించారు. సంరక్షణ కేంద్రాల్లో పెరిగిన కొన్ని పక్షులను ఈ ఏడాది నిర్దేశిత విధానాన్ని అనుసరిస్తూ అటవీ ప్రాంతంలో విడుదల చేస్తామని, ఇది ఈ ప్రాజెక్టుకు నూతన సవాలుతో నిండిన ప్రారంభమన్నారు. ఈ విజయం సాధించిన రాజస్థాన్ అటవీ విభాగం అధికారులను అభినందించారు.

# దళిత మహిళా మున్సిపల్ వైస్ చైర్మన్‌కు అవమానం

**-వైస్ చైర్మన్‌ను వేదికపైకి పిలవకపోవడం వివక్షే..**

**-కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**-పరకాల మున్సిపల్ అధికారులపై ఏకు శంకర్ మాదిగ మండిపాటు**




హన్మకొండ, మార్చి 14:పరకాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ ఏకు దివ్యకు జరిగిన అవమానంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం జరిగిన సభలో ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధిని వేదికపైకి ఆహ్వానించకుండా, సాధారణ సభ్యుల వరుసలో కూర్చోబెట్టడం మున్సిపల్ ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కడమేనని ఆయన మండిపడ్డారు.

ఈ సందర్భంగా శంకర్ మాదిగ మాట్లాడుతూ మున్సిపాలిటీలో రెండో అత్యున్నత పదవిలో ఉన్న వైస్ చైర్మన్‌ను వేదికపైకి పిలవకపోవడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. "చైర్మన్ పక్కన కూర్చోవాల్సిన వైస్ చైర్మన్‌ను కింద కూర్చోబెట్టడం అంటే అది కేవలం ప్రోటోకాల్ ఉల్లంఘన మాత్రమే కాదు, దళిత మహిళా నేత పట్ల ప్రదర్శించిన అహంకారం మరియు వివక్షత" అని ఆయన ధ్వజమెత్తారు. అధికారులు కావాలనే దళిత మహిళా వైస్ చైర్మన్ ను పక్కన పెట్టారా.. లేక ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి ఈ పని చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయి.. మున్సిపల్ చట్టం ప్రకారం డయాస్ ( వేదిక) మీద చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్‌లకు ఖచ్చితంగా స్థానం కల్పించాలి. కానీ పరకాల మున్సిపాలిటీలో నిబంధనలను గాలికొదిలేసి, ప్రజాప్రతినిధిని అవమానపరిచేలా వ్యవహరించడం శోచనీయమని అన్నారు. పరకాల ఎమ్మెల్యే కుట్రపూరితంగానే దురాహంకారంతో దళిత మహిళ వైస్ చైర్మన్ అవమానం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపల్ కమిషనర్ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి బాధ్యతారాహిత్యం వల్లే ఈ పరాభవం జరిగిందని ఆయన ఆరోపించారు.

వెంటనే ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, ప్రోటోకాల్ పాటించని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. బాధ్యులను సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్కు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దళిత ప్రజాప్రతినిధులకు ఆత్మగౌరవం దక్కే వరకు పోరాటం ఆపబోమని శంకర్ స్పష్టం చేశారు.

# నందిమేడారంలో ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు



కరీంనగర్, మార్చి 14:పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది రిజర్వాయర్ సమీపాన శనివారం గంగపుత్రుల ఆరాధ్య దైవం శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నూతనంగా శ్రీ గంగమ్మ తల్లి గుడిని నిర్మించారు. ఈ క్రమంలో స్థానిక గంగపుత్ర సంఘం, శ్రీ గంగాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.ఉత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమైనాయి. దీంతో ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నూతనంగా నిర్మించిన గుడిలో శ్రీ గంగమ్మ తల్లి విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ప్రతిష్టించారు. శ్రీ గంగమ్మ తల్లి తో పాటు గణపతి, శివలింగం పార్వతి, నందీశ్వరుడు, మకరం దేవి విగ్రహాలను కూడా గుడిలో ప్రతిష్టించారు. శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు.

# సమాజ సేవలో వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

కరీంనగర్, మార్చి 14: సామాజిక సేవలో వీఎన్ఆర్ ఫౌండేషన్ అనేక కార్యక్రమాలను చేపడుతుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వీ నరేందర్ రెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థమై పరీక్ష కేంద్రాల వద్ద వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా ఆధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో అనేక అద్భుతాలు సృష్టిస్తున్నామని అంతేకాకుండా సామాజిక సేవతో పాటు పేదవారికి వీఎన్ఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఎండ తీవ్రతలు అధికంగా ఉండడంతో విద్యార్థులను ఎండ దెబ్బకు గురి కాకుండా ఉండేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వీఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు గోపతి సత్యం, బీ రవీందర్, వేముల కిరణ్, రామకృష్ణ, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా సభ్యులు అరెస్ట్

**-రూ.13.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**

**-చోరీ కేసు చేధించిన సూర్యాపేట జిల్లా సిసిఎస్, ఆత్మకూరు పోలీసులు**

**-వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నరసింహ**



సూర్యాపేట, మార్చి 14 : వరుస దొంగతనాలుకు పాల్పడుతూ బంగారు ఆభరణాలు, ఆటోలు, బైక్ లు ల్యాప్‌టాప్‌లు దొంగిలించే ముఠాను సీసీఎస్, ఆత్మకూరు (ఎస్) పోలీసులు అరెస్టు చేసి రూ.13.35 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కె.నరసింహ కేసు వివరాలు వెల్లడించారు.

నిందితులు కంచు కొమ్ముల సంతోష్, కంచుకొ మ్ముల గణేశ్, షేక్ నశ్రీన్, కంచుకొమ్ముల సాయికిరణ్ ఒక ముఠాగా ఏర్పడి ఆటోలను దొంగలించి, వాటిలోనే ప్రయాణం చేస్తూ ఒంటరిగా ప్రయాణిస్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని బెదిరించి ఆభరణాలు దొంగలించే వారు. దొంగలించిన ఆటోలోనే తిరుగుతూ రాత్రివేళ తాళాలు వేసిన ఇండ్లలో దొంగ తనం చేయడం వీరి పద్ధతి. సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు చెందిన వీరు ముఠాగా ఏర్పడి ఈ నెల 6న ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని కోటినాయక్ తండా శివారులో ఒక వృద్ధురాలిని ఆటోలో ఎక్కించుకుని కొంత దూరం తీసుకువెళ్లి చంపుతామని బెదిరించి ఆమె మెడలోని వెండి గొలుసులను అపహరించుకుపోయారు.

బాధితులు ఈ నెల 10న ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చోరీ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా సిసిఎస్ పోలీసులు ఆత్మకూరు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నేరస్తులను గుర్తించి వారి కదలికలను గమనించారు. శనివారం ఉదయం ఆత్మకూరు మండల పరిధిలోని ఏనుబాముల స్టేజీ వద్ద సిసిఎస్ ఇన్‌స్పెక్టర్, ఆత్మకూరు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నలుగురు అనుమానితులు టీఎస్ 29 టీ 1190 ఆటోలో నెమ్మికల్ వైపు వెళ్తుండగా అదుపులోకి తీసుకోన్నారు.

కోదాడ రాజీవ్ నగర్‌కు చెందిన కంచుకొమ్ముల సంతోష్, కంచుకొమ్ముల గణేశ్, కంచుకొమ్ముల సాయికిరణ్, సూర్యాపేటకు చెందిన షేక్ నశ్రీన్లుగా గుర్తించారు.

వీరు గతంలో మునగాల, సూర్యాపేట టౌన్, కోదాడ టౌన్, తిప్పర్తి, పిడుగు రాళ్ల, వేళ్లచెరువు, ఫిల్మ్ నగర్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్ల పరిధిలో బంగారు, వెండి అభరణములు, వెండి వస్తువులు, ఆటోలు, మోటార్ సైకిల్, సెల్ ఫోన్ దొంగతనాలు చేసినట్లు అంగీక రించారు.

నిందితుల నుండి రూ.3 లక్షల విలువైన 18 గ్రాముల బంగారం, రూ.5 లక్షల విలువైన 1.5 కేజీల వెండి, రూ.4 లక్షల విలువైన 3 ఆటోలు, రూ.50 వేల విలువైన ట్యాబ్, ల్యాప్ టాప్, 1 బైక్, 1 టీవి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులందరు దగ్గరి బంధువులు ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నారు. వీరందరూ పాత నేరస్తులు పలు స్టేషన్లలో వీరిపై కేసులు నమోదయ్యాయి. కేసు చేదనలో బాగా పని చేసిన సిసిఎస్ సిబ్బంది, ఆత్మకూరు ఎస్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐలు శ్రీకాంత్, హరికృష్ణ, ఆర్ఎస్ఐ రాజశేఖర్, సిసిఎస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశంలో వాణిజ్య గ్యాస్ కొరత.. తమిళనాడు సర్కారు కీలక నిర్ణయం..!




న్యూఢిల్లీ, మార్చి 14:పశ్చిమాసియాలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ యుద్ధం ఫలితంగా ఇతర దేశాలతోపాటు భారత్‌లో కూడా కమర్షియల్ వంట గ్యాస్ కొరత ఏర్పడింది. దాంతో దేశవ్యాప్తంగా ఇప్పటికే పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి.

ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన సీనియర్ అధికారులు సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. టీస్టాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్‌లు, క్లౌడ్ కిచెన్ సహా ఆహార తయారీ కేంద్రాలు ఏవైనా ఎల్పీజీకి బదులుగా ఎలక్ట్రిక్ స్టౌవ్‌లను ఉపయోగిస్తే.. ఒక యూనిట్ విద్యుత్‌పై రూ.2 సబ్సిడీ అందించనున్నట్లు ప్రకటించారు.

వంట గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో వంట కోసం గ్యాస్‌కు బదులుగా విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తమిళనాడు ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో వంటగ్యాస్ కొరత తీవ్రత తగ్గేవరకు సబ్సిడీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

# కాపీరైట్ రక్షణకు చర్యలు.. ఉల్లంఘనల కోసం డిజిటల్ వేదికలపై ప్రసార భారతి నిరంతర పర్యవేక్షణ

న్యూఢిల్లీ, మార్చి 14:ప్రసార భారతి స్వయంగా రూపొందించిన లేదా సిద్ధం చేయించిన కంటెంట్‌పై పూర్తి కాపీరైట్ హక్కులను కలిగి ఉంటుంది. మీడియా ప్రొడక్షన్ సంస్థల ద్వారా కాపీరైట్ ఉల్లంఘనలకు సంబంధించి ఇటీవల ఎటువంటి కేసులు నమోదవ్వలేదు. అయితే సోషల్ మీడియా వంటి మధ్యంతర వేదికల్లో వ్యక్తిగత వినియోగదారులు చేసే కాపీరైట్ ఉల్లంఘనలను ప్రసార భారతి నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటోంది. ప్రొడక్షన్ పనులను ఇతరులకు సబ్-కాంట్రాక్టుకు ఇచ్చిన సందర్భాలేవీ ప్రసార భారతి దృష్టికి రాలేదు. ముందు జాగ్రత్తగా ప్రొడక్షన్ సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాల్లోనే సబ్-కాంట్రాక్టును పరిమితం చేసే నిబంధనలను చేర్చింది.


దూరదర్శన్ కింద ప్రారంభించిన 'క్రియేటర్స్ కార్నర్' కార్యక్రమం ద్వారా కంటెంట్ క్రియేటర్లను ప్రజా ప్రసార సంస్థ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా సామాజికంగా ఉపయోగపడే అంశాలను, దేశ సాంస్కృతిక వైభవం, సంప్రదాయాలను ప్రతిబింబించే కంటెంట్‌ను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ప్రధాన ఉద్దేశం. "క్రియేటర్స్ కార్నర్"కింద ఎంపిక కావాలంటే కంటెంట్ నాణ్యత బాగుండాలి. ప్రసార భారతి ప్రోగ్రామ్, అడ్వర్టైజింగ్ కోడ్‌లతో పాటు అన్ని చట్టాలకు అనుగుణంగా ఉండాలి. కంటెంట్ సృష్టికర్తలకు కనీసం ఒక ప్రధాన సోషల్ మీడియా వేదికలపై తగినంత ఫాలోయింగ్ ఉండాలి. ఎంపికైన కంటెంట్‌కు నిడివి ఆధారంగా ప్రసార భారతి నిర్ణయించిన రేట్ల ప్రకారం పారితోషికం చెల్లిస్తారు.

ఈ సమాచారాన్ని రాజ్యసభలో శ్రీ శ్రీ తిరుచ్చి శివ అడిగిన ప్రశ్నకు సమాధానంగా సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లిఖితపూర్వక సమాధానంలో అందించారు.

# లక్కవరంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

అనంతగిరి, మార్చి 14 : అనంతగిరి మండలంలోని లక్కవరంలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో రెండవ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ఆళ్ల నవ్య సురేందర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నిలపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవరపల్లి లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి త్రివేణి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ బుర్ర నర్సింహారెడ్డి, గ్రామ పెద్దలు బుర్ర పుల్లారెడ్డి, వార్డు సభ్యులు మంద భవాని, మంద వెంకటేశ్వర్లు, ఇలవల రమాదేవి, సురేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కబీర్ సాహెబ్ పాల్గొన్నారు.

# హాస్య రచయితలలో అగ్రగణ్యులు మునిమాణిక్యం



మార్చి 15... మునిమాణిక్యం నరసింహారావు జయంతి

తమ రచనల ద్వారా మధ్య తరగతి సంసారంలోని సరిగమల్ని ఎన్నింటినో వినిపించిన రచయిత మునిమాణిక్యం నరసింహారావు . తెలుగు హాస్య రచయితలలో ముని మాణిక్యంకు ఒక విశిష్ట స్థానం ఉంది. ఆయన కేవలం హాస్యరచయిత మాత్రమే కాదు. హాస్యోపాసకులు కూడా. విభిన్న కథలను మనసు పెట్టి చదువుకుంటే నేటి యువతీ యువకులు విడాకుల మాటే ఎత్తరని చాలా మంది అభిప్రాయం. సంసారాన్ని ఎలా రసభరితంగా చేసుకోవాలో చెప్పిన గొప్ప విశ్లేషకులు ఆయన. గృహస్థ జీవితాన్ని గురించి ఆయన చెప్పినట్లు మరెవరూ చెప్పలేదేమో.

**ముని మాణిక్యం నరసింహారావు తెనాలి తాలూకా, సంగం జాగర్లమూడిలో మార్చి 15, 1898 న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు వెంకాయమ్మ, సూర్యనారాయణ. ఆయన తెనాలిలో ఇంటర్మీడియెట్ చదివారు. డిగ్రీ చదవడానికి తాహతు లేకపోతే కొండా వెంకటప్పయ్య సహాయం వల్ల బి.ఎ చదివారు. తర్వాత గుంటూరు, భీమవరం, బందరు, కళాశాల్లో 30 ఏళ్ళు పని చేశారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకొన్నారు.**

వ్యక్తుల మనసులను అలరించే హాస్యోక్తులు,హాస్య సన్నివేశాలు ఎక్కడ ఆయన దృష్టికి తెచ్చినా వాటిమీద మక్కువతో అనువదించి గాని, అనుసరించిగాని, భాషను కొంచెం హాస్య యుక్తంగా మార్చి తెలుగు పాఠకులకు అందజేసే వారు. హాస్య రచయితలలో అగ్రస్థానం మునిమాణిక్యందే.

ఆయన వ్రాసిన 'దాంపత్యోపనిషత్' మునిమాణిక్యం నరసింహారావు ఇరవైయ్యవ శతాబ్దం మొదటి పాదంలో ఒక కథకుడిగా రూపు దిద్దుకున్నారు. ముఖ్యంగా దంపతుల నడుమ జరిగే సున్నితమైన హాస్య శృంగార ఘట్టాలను అందించడంలో ఆయన అందె వేసిన చేయి. కుటుంబ జీవితం లోని కష్టసుఖాలు, దాంపత్య జీవితం లోని సౌందర్యం ఆయన కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన సృష్టించిన కాంతం తెలుగు సాహిత్యంలోనే గొప్ప స్థానం పొందింది. కాంతం" పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేది మునిమాణిక్యం నరసింహారావు. కాంతం కథల ద్వారా అయన తెలుగు పాఠకులకు సుపరిచితులు. తెలుగు సాహిత్యంలో ఒక "కాంతం" అన్న పాత్రను సృష్టించి ఆ పేరున ఎన్నో రచనలు చేశారు. కాంతం కథలతో తెలుగువాళ్ల మనసుల్లో చిరునవ్వులు పూయించి, మధ్య తరగతి జీవితాల్లో భార్యాభర్తల అనుబంధాన్ని కళ్లకు కట్టిన రచయిత ముని మాణిక్యం నరసింహారావు.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో విద్యా ప్రసారాలు అసిస్టెంట్ ప్రొడ్యూసర్ గా పని చేశారు. అంధ్ర సార స్వత పరిషత్, తెలుగు పండిత శిక్షణ పాఠశాల హెడ్మాష్టర్ గా హైదరాబాదులో 5 ఏళ్ళు పని చేశారు.

ముని మాణిక్యం నరసింహారావు తెనాలి తాలూకా, సంగం జాగర్లమూడిలో మార్చి 15, 1898 న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు వెంకాయమ్మ, సూర్యనారాయణ. ఆయన తెనాలిలో ఇంటర్మీడియెట్ చదివారు. డిగ్రీ చదవడానికి తాహతు లేకపోతే కొండా వెంకటప్పయ్య సహాయం వల్ల బి.ఎ చదివారు. తర్వాత గుంటూరు, భీమవరం, బందరు, కళాశాల్లో 30 ఏళ్ళు పని చేశారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకొన్నారు.

ఆయన భార్య "కాంతం. ఆయనకు ఇద్దరు మగపిల్లలు. ముగ్గురు ఆడపిల్లలు. ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఉపాధ్యాయుడిగా, ఆకాశవాణిలో పనిచేశారు. ఆయన రాసిన మొదటి నవల 'టీకప్పులో తుఫాను'. ఇందులోనే మొట్ట మొదటిగా కాంతం పాత్ర కనపడుతుంది. కాంతం కుటుంబం పేద కుటుంబం. కాంతం కథలలో ఒకటి ఆయన రేడియో నాటకంగా రాస్తే ఆయన కుమార్తె కాంతంగా వేసి అందరినీ మెప్పించింది.

ఆయన "కాంతం కథల" కి ఆయన భార్యే ప్రేరణ, స్ఫూర్తి. నిజ జీవితంలోనే దాంపత్య సన్నివేశాలను, చిన్న సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసినవి కాబట్టే ఇప్పటికీ కాంతం కథలు నిత్య నూతన మనిపిస్తాయి. మన హాస్యం పేరుతో ఆయన చక్కని గ్రంథం వెలువరించారు. వక్రరేఖ తిరుమాళిగ, దీక్షితులు కాంతం, నేను–మా కాంతం (1933), కాంతం కైఫీయత్, కాంతం కాపురం, మునిమాణిక్యం కథలు, రుక్కుతల్లి – శరద్రాత్రులు, అన్నయ మంత్రి, మరపు, స్తుతి – ఆత్మస్తుతి, ఇల్లు – ఇల్లాలు, మంచివాళ్ళ మాట తీరులు, గాజుల పెట్టి, తల్లి ప్రేమ

**మునిమాణిక్యం నరసింహారావు ఇరవైయ్యవ శతాబ్దం మొదటి పాదంలో ఒక కథకుడిగా రూపు దిద్దుకున్నారు. ముఖ్యంగా దంపతుల నడుమ జరిగే సున్నితమైన హాస్య శృంగార ఘట్టాలను అందించడంలో ఆయన అందె వేసిన చేయి.**

అయన రచనలలో ప్రసిద్ధం. తిరుమాళిగ, దక్కుతల్లి , దీక్షితులు నవలికలు – కరుణ రస భరితాలు. పిల్లలకు, విద్యార్థులకు సరిపడేలా అన్నయ మంత్రి, వక్రరేఖ నవలలను రచించారు. తిరుగు బాటు అనే నాటకం వ్రాశారు.

ఇంటావిడతో పోట్లాట, ప్రణయ కలహం, భార్యను లొంగదీసు కోవడం ఎలా – వంటి రచనలు హాస్యస్ఫోరకాలు, మధ్యతరగతి సంసారాల దాంపత్య జీవిత రహస్యాలను ఆయన సజీవ పాత్రలుగా సృష్టించారు. తెలుగు సాహిత్యాన్ని తమ సునిశిత హాస్యంతో సుసంపన్నం చేసిన మునిమాణిక్యం ఫిబ్రవరి 4, 1973న మరణించారు.



–రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

## - 163 బీఎన్ఎస్ (సెక్షన్ 144) అమలు-

## -జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

రాజన్న సిరిసిల్ల, మార్చి 14: నేటినిజం (ప్రతినిధి): పదవ తరగతి పరీక్షల సందర్భంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని క్షేత్రస్థాయిలో పరిశీలించి,పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడుతున్న తీరును సమీక్షించి,కేంద్రాల వద్ద విధుల్లో



గీతనగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కుసుమరయ్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలన్ని జిల్లా ఎస్పీ ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 34 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షలు సజావుగా,అవాంఛనీయ ఘటనలు లేకుండా జరగడానికి 163 బీ ఎన్ ఎస్ ఎస్ (సెక్షన్ 144) అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని,ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడ కుండా చూడలన్నారు.పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల సమీపంలోని (100 మీటర్ల పరిధిలో) అన్ని ఫోటోకాపీ (జిరాక్స్) మరియు ఇంటర్నెట్ సెంటర్లను పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కేంద్రాలు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమించి పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడినా లేదా అనుమతి లేకుండా జిరాక్స్ సెంటర్లు తెరిచినా సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..ముగ్గురు స్పాట్ డెడ్

మెదక్, మార్చి 14:జిల్లాలోని కొల్చారం మండలం రాంపూర్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో (ఖీనీజీట ం౩ఞ౩ఞ తిటవనిబి ) ముగ్గురు దుర్మరణం చెందారు. నర్సాపూర్ వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం మెదక్ నుంచి సంగారెడ్డి వెళ్తున్న ఆర్ టీ సీ బస్( ఖీఅ ఃబిబ ) ఢీ జాతీయ రహదారిపై ఢీ కొట్టింది.

దీంతో హవేలీ ఘనపూర్ మండలం బూర్గుపల్లి కి చెందిన తండ్రి కొడుకులు అమృత్ గౌడ్ (51), రిశివర్ధన్ గౌడ్ (13), బొగడ భూపతి పూర్‌కు చెందిన సాయ గౌడ్ (32) మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు.

మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు.

# భీమన్న సేవలో జడ్చర్ల ఎమ్మెల్యే



రాజన్న సిరిసిల్ల, మార్చి 14: నేటినిజం (ప్రతినిధి): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేని ఆలయ అర్చకులు స్వస్తి వచనాలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆయన స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రమాదేవి ఎమ్మెల్యేకు స్వామివారి లడ్డు ప్రసాదం అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# బాధితులకు చెల్మెడ పరామర్శ



రాజన్న సిరిసిల్ల, మార్చి 14: నేటినిజం (ప్రతినిధి): మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన తోపారపు కమల ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చెల్మెడ ఆసుపత్రిలో చేరగా, వారిని శనివారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చెల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు.

ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

# బిఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి చేయూత

## -మృతుడి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం



రాజన్న సిరిసిల్ల, మార్చి 14: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న శాత్రాజుపల్లెకు చెందిన ఎలవేని ప్రశాంత్ (32) ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలిసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రేగుల రాజేశం, నల్ల సతీష్ రెడ్డి, వికృతి సాయి గౌడ్, చందనం వెంకటేష్, వనపర్తి సురేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో డొమెస్టిక్ గ్యాస్ సరఫరాకు కొరత లేదు : కలెక్టర్ బి.చంద్రశేఖర్

నల్లగొండ, మార్చి 14 : ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ యుద్ధం కారణంగా కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ స్టాక్స్ తగ్గినప్పటికీ జిల్లాలో డొమెస్టిక్ గ్యాస్ సరఫరాకు ఏలాంటి కొరత లేదని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా లేదన్న సాకుతో జిల్లాలోని హాస్టళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల భోజనానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని ప్రిన్సిపాళ్లను, సంక్షేమ శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. యుద్ధం కారణంగా ఏర్పడిన ఎల్పీజీ గ్యాస్ కృత్రిమ సరఫరా కొరత నేపథ్యంలో గ్యాస్ సక్రమ సరఫరా, పర్యవేక్షణ విషయమై ప్రభుత్వం "జిల్లా స్థాయి ఇంధన సరఫరా పర్యవేక్షణ కమిటీ" ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, పౌర సరఫరాల జిల్లా అధికారి కన్వీనర్ గా, పోలీస్ సూపరింటెండెంట్, రెవెన్యూ అదనపు కలెక్టర్, ఓఎంసీ రీజనల్ మేనేజర్, ట్రాన్స్‌పోర్ట్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అన్ని సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, ఎల్పీజీ గ్యాస్ సరఫరా ఏజెన్సీల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని వెల్లడించారు.

శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన "జిల్లా స్థాయి ఇంధన సరఫరా పర్యవేక్షణ కమిటీ" సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అమెరికా, ఇరాన్ యుద్ధం కారణంగా కమర్షియల్ ఎల్పిజి గ్యాస్ సరఫరాలో తేడా రావడం జరిగిందని, యుద్ధము మొదలైనప్పటినుండి గ్యాస్ సరఫరా కొద్దిగా తగ్గినప్పటికీ గడిచిన నాలుగు రోజుల నుండి మాత్రమే జిల్లాలో సమస్య వచ్చిందని తెలిపారు. అయితే డొమెస్టిక్ గ్యాస్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదని, కమర్షియల్ స్టాక్స్ మాత్రమే తగ్గాయని స్పష్టం చేశారు. గతంలో సిలిండర్ సరఫరాకు 21 రోజుల సమయం ఉండగా, ప్రస్తుతం గ్యాస్ ఏజెన్సీలు దానిని 45 రోజులకు మార్చడం జరిగిందన్నారు. డొమెస్టిక్ ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాలో ఎలాంటి తేడాలు లేనందున డొమెస్టిక్ ఎల్పీజీ గ్యాస్ సరఫరా ఎట్టి పరిస్థితులలో ఆగకూడదని చెప్పారు. గ్యాస్ ఏజెన్సీలు ఎప్పటిలాగే డెలివరీ చేయాలని, ఎక్కడ డెలివరీ ఆపకూడదన్నారు.

డొమెస్టిక్ సిలిండర్ లను కమర్షియల్ కు వాడడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నిజాయితీ చాటుకున్న శానిటేషన్ కార్మికురాలు

## -ఘనంగా సత్కరించిన ఆలయ ఈవో రమాదేవి



రాజన్న సిరిసిల్ల, మార్చి 14: నేటినిజం (ప్రతినిధి): శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వర ఆలయంలో పనిచేస్తున్న సానిటేషన్ కార్మికురాలు డబ్బు నాగమణి నిజాయితీకి నిదర్శనంగా నిలిచారు. ఆమె చేసిన సత్యనిష్ఠ పనిని గుర్తించి ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. వరంగల్ జిల్లా లింగాల ఘనపురం మండలం కుందారం గ్రామానికి చెందిన రేసు సతీష్ అనే భక్తుడు సుమారు నాలుగు తులాల బంగారు బ్రాస్లెట్ (అంచనా విలువ సుమారు రూ.8 లక్షలు) ఆలయ ప్రాంగణ ంలో ఎక్కడో పోగొట్టుకున్నారు.ఆలయంలో సానిటేషన్ పనులు నిర్వహిస్తున్న నాగమణి ఆ బ్రాస్లెట్‌ను గుర్తించి వెంటనే ఆలయ అధికారులకు అప్పగించారు. అనంతరం అధికారులు భక్తుడు సతీష్‌ను సంప్రదించి ఆయనకు ఆ బ్రాస్లెట్‌ను సురక్షితంగా తిరిగి అందజేశారు.నాగమణి చూపిన నిజాయితీని ప్రశంసిస్తూ ఆలయ ఈవో రమాదేవి ఆమెను ప్రత్యేకంగా సత్కరించారు. ఆలయం తరపున ఒక చీరను అందజేయడంతో పాటు ఈవో రమాదేవి వ్యక్తిగతంగా మరో చీరను కూడా అందించి అభినందించారు.కొన్ని సంవత్సరాలుగా ఆలయంలో సేవలు అందిస్తూ నిజాయితీతో విధులు నిర్వహిస్తున్న నాగమణి వంటి సిబ్బంది ఆలయానికి గర్వకారణమని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మొదటి రోజు ప్రశాంతంగా ఎస్ఎస్సీ పరీక్షలు

## -జిల్లా విద్యాధికారి బి జగన్ మోహన్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, మార్చి 14: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు శనివారం ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. జిల్లాలోని మొత్తం 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, 7307 మంది విద్యార్థులకు గాను 7299 మంది హాజరై 99.89 శాతం హాజరు నమోదు అయింది. 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

జిల్లా కలెక్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) శివనగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెహ్రూనగర్ సిరిసిల్ల పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను



పరిశీలించారు. జిల్లా ఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) గీతానగర్ సిరిసిల్ల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.అదేవిధంగా రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించాయి.

మొదటి రోజు పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా జరిగాయని జిల్లా విద్యాధికారి డా. బి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**

RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com